# అఖండ భూమి
AKANDA BHOOMI TELUGU DAILY

ఎడిటర్ : యం. ఈశ్వరయ్య — సంచలన దినపత్రిక

ప్రచురణ: కర్నూలు,ఆంధ్రప్రదేశ్ సంపుటి : 04 సంచిక : 51 ఎడిటర్ : ఎం ఈశ్వరయ్య పేజిలు : 08, శనివారం 18-04-2026 సెల్ : 9440912389, 9490315559 వెల రూ. 2 రూ/

Published From kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor, Kurnool,




తల్లిని, చెల్లిని గెంటేసిన వ్యక్తి మహిళా పక్షపాతి అవుతారా?



మహిళల ప్రగతి కోసమంటూ ఆడిన నాటకం ఫెయిల్!

## హర్మూజ్ తెరిచినందుకు ఇరాన్ కు థాంక్స్ చెప్పిన ట్రంప్... కానీ!



- హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు ఇరాన్ అనుమతి
- అయితే ఇరాన్‌పై నావికా దిగ్బంధం కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం
- లెబనాన్ కాల్పుల విరమణ నేపథ్యంలో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది
- ఇరాన్‌తో ఒప్పందం పూర్తయ్యే వరకు ఆంక్షలు ఉంటాయని తెలిపిన అమెరికా
- ఈ పరిణామంతో ప్రపంచ మార్కెట్లలో తగ్గిన చమురు ధరలు

మధ్యప్రాచ్యంలో నెలకొన్న కాల్పుల విరమణ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల రాకపోకలకు తెరిచినప్పటికీ, ఇరాన్‌పై మాత్రం తమ నావికా దిగ్బంధం (బ్లాకేడ్) కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధి వ్యాపారానికి, రాకపోకలకు - మిగతా 2 లో

## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులకు బ్రేక్



- లోక్ సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు
- రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు
- బిల్లుకు వ్యతిరేకంగా 230 ఓట్లు
- మూడింట రెండొంతుల మెజార్టీ రాకపోవడంతో వీగిపోయిన బిల్లు

కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి లోక్‌సభలో ఊహించని, భారీ ఎదురుదెబ్బ తగిలింది. దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు శుక్రవారం సభలో వీగిపోయింది. లోక్‌సభ స్థానాలను పెంచడంతో పాటు, చట్టసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించిన ఈ బిల్లు, అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని - మిగతా 2 లో

## విమర్శల నుంచి విజయ శిఖరం వరకు..
# లోకేష్ రాజకీయ ప్రస్థానం ఇదే..!

- ప్రత్యర్థి పార్టీ నుంచి విమర్శలు..
- ఇబ్బందికర పరిస్థితులను ఎదురొడ్డి..
- పార్టీ అగ్రనేతలను సమన్వయం చేసుకోవడం..




సానుకూల ఆలోచనా ధోరణితో యువ నేత నారా లోకేశ్ అడుగులేస్తున్నారు. విమర్శకులు సైతం ముక్కున వేలేసుకునే పరిస్థితులు చోటుచేసుకున్నాయి. రాజకీయాల్లో చెలామణి కావాలనే పట్టుదలకు ప్రజా విశ్వాసం తోడైంది. నవతర రాజకీయాల్లో తిరుగులేని నాయకుడిగా నిలబెట్టాయి. తెలుగుదేశం పార్టీలో నెంబర్ టూ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. రాజకీయ కుటుంబంలో పుట్టిన లోకేశ్ రాజకీయాలకు వారసుడిగా మారేందుకు చాలాకాలం పట్టింది. తాత స్థాపించిన పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులయ్యారు. తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు నాయుడు అంచెలు అంచెలుగా ఎదిగి.. ఆపార్టీకి అధ్యక్షుడిగా... రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. రాజకీయ పదవులు కోరుకుంటే వచ్చేవికావు.. ప్రజలు ఆశీర్వదించాలి... పార్టీలో కార్యకర్తలు కోరుకోవాలి. ఈ విధానంతో యువ నాయకుడు, చంద్రబాబు కుమారుడు లోకేశ్ ఎదుగుతూ వచ్చారు. కుటుంబానికి తాత ఎన్టీరామారావు, ఆతర్వాత చంద్రబాబునాయుడు.. వేర్వేరు సందర్భాల్లో రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన వారు.. కుటుంబానికి బలమైన

## మహిళా బిల్లును వ్యతిరేకించి ఏం సాధించారు?



మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును వ్యతిరేకించిన పార్టీలపై జగన్ విమర్శలు ఈ పరిణామంతో మహిళలకు, దక్షిణ రాష్ట్రాలకు న్యాయం జరగలేదని వ్యాఖ్య 2026 జనాభా లెక్కలతో డీలిమిటేషన్ చేస్తే దక్షిణాదికి నష్టమని ఆందోళన కుటుంబ నియంత్రణ పాటించినందుకు శిక్ష

## పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు
### మరో స్టాండప్ కమెడియన్ అరెస్ట్




పవన్ కల్యాణ్‌పై వివాదాస్పద వ్యాఖ్యల కలకలం మరో స్టాండప్ కమెడియన్ రఫీక్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు బెయిల్‌పై విడుదలైన కమెడియన్ అనుదీప్ కటికాల వ్యక్తిగత విమర్శల వెనుక రాజకీయ కుట్ర ఉందన్న అనుమానాలుఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలకు దిగిన ఇద్దరు స్టాండప్ కమెడియన్లపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే అనుదీప్ కటికల అనే కమెడియన్‌ను అరెస్ట్ చేయగా, తాజాగా విశాఖపట్నంకు చెందిన మరో కమెడియన్ రఫీక్ మొహమ్మద్‌ను పోలీసులు

## మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ మాయోపాయం పారలేదు: షర్మిల



- వీగిపోయింది డీలిమిటేషన్ బిల్లేనని, మహిళా బిల్లు కాదని వ్యాఖ్య
- విపక్షాలు మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ
- 2023లో ఆమోదం పొందిన బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్
- 543 లోక్‌సభ స్థానాల్లో 33 శాతం కోటా వర్తింపజేయాలని సూచన

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో - మిగతా 2 లో

## లోక్ సభలో మహిళా బిల్లు వీగిపోవడానికి పూర్తి బాధ్యత బీజేపీదే





- డీలిమిటేషన్ అంశాన్ని ముడి పెట్టడంతోనే వీగిపోయిందన్న కేటీఆర్
- బీఆర్ఎస్ సహా అన్ని పార్టీలు మహిళా రిజర్వేషన్లకు సానుకూలమేనని వెల్లడి
- బీజేపీ రాజకీయంతోనే బిల్లు వీగిపోయిందని విమర్శ
- ఇప్పటికైనా డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు తేవాలని సూచన

లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ పన్నిన కుటిల రాజకీయాల

## మేడిగడ్డ బ్యారేజీ
# పునరుద్ధరణ పనులు

- ప్రభుత్వానికి మాట రానివ్వద్దని సీఎం ఆదేశాలు
- ఎన్డీఎస్ఏ మార్గదర్శకాల మేరకే చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- మంత్రి ఉత్తమ్‌తో కలిసి అధికారులతో ఢిల్లీలో సమీక్ష




గత పాలకుల తప్పుల వల్లే బ్యారేజీలు పనికిరాకుండా పోయాయన్న ముఖ్యమంత్రి కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు ఎన్డీఎస్?ఏ మార్గదర్శకాలకు అనుగుణంగానే చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో నీటి పారుదల

## వీగిపోయిన మహిళా రిజర్వేషన్ బిల్లు
### బీజేపీపై కవిత తీవ్ర ఆగ్రహం



- ప్రతిపక్షాలు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తాయని బీజేపీకి తెలుసన్నకవిత
- తమకు సంఖ్యాబలం లేకపోయినా బీజేపీ హడావుడిగా బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శ
- బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు
- మహిళ నాయకత్వం వహిస్తున్న పశ్చిమ బెంగాల్ నుంచి ప్రారంభించాలని పిలుపు

లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. - మిగతా 2 లో

## రాజ్యాంగంపై దాడిని అడ్డుకున్నాం



- కీలక బిల్లు ఓటమిపై రాహుల్ గాంధీ
- లోక్‌సభలో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ.. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు వీగిపోయింది
- బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు.. మెజారిటీకి 60 ఓట్ల దూరంలో ఓటమి
- మహిళల పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రను అడ్డుకున్నామన్న రాహుల్ గాంధీ
- డెలిమిటేషన్‌తో రిజర్వేషన్లను ముడిపెట్టడాన్ని 'ఇండియా' కూటమి తీవ్రంగా వ్యతిరేకించింది

కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సభలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహిళా రిజర్వేషన్ల చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ ప్రభుత్వం - మిగతా 2 లో

## మీకు మహిళల ఉసురు తగులుతుంది
### విపక్షాలపై అమిత్ షా ఫైర్



- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు తిరస్కరణ
- విపక్షాల వల్లే బిల్లు వీగిపోయిందని అమిత్ షా ఆరోపణ
- కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలపై ఆగ్రహం
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు

మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై తీవ్రస్థాయిలో - మిగతా 2 లో

## మైక్రో ఫైనాన్స్ కేసులో కింగ్ పిన్ మంగ్లీ..?



- వెలుగులోకి సంచలన విషయాలు.!.
- సింగర్ మంగ్లీ వివాదంలో తవ్వుతున్న కొద్ది కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా..
- పోలీసులు రమావత్ మధును అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.
- ఈ క్రమంలో అనేక విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి.
- సింగర్ మంగ్లీ వివాదం తెలుగు రాష్ట్రాల్లోనే హాట్ టాపిక్ గా మారింది.

ఇప్పటికే దీనిపై లాయర్ సుబ్బు పంజాగుట్ట పీఎస్ లో మంగ్లీ, రమావత్ మధు, మంగ్లీ సోదరుడిపై ఫిర్యాదు చేశారు. దీనిపై కౌంటర్ గా మంగ్లీ సైతం నార్సింగీ పీఎస్ లో, పంజాగుట్ట పీఎస్ లో లాయర్ సుబ్బుపై కేసు నమోదు చేసింది. దీనిపై దుమారం రాజుకుంది. ఈ క్రమంలో తాజాగా.. పోలీసులు - మిగతా 2 లో

## ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త...

- హర్మూజ్ ను పూర్తిగా తెరిచామంటూ ప్రకటన
- హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల కోసం తెరిచినట్లు ప్రకటించిన ఇరాన్
- లెబనాన్‌లో కాల్పుల విరమణ కొనసాగినంత కాలం ఈ నిర్ణయం అమలు
- నిర్ణీత మార్గంలోనే నౌకలు ప్రయాణించాలని స్పష్టం చేసిన ఇరాన్
- ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ అధికారిక ప్రకటన



ఇటీవల కాలంలో చమురు, ఎల్పీజీ సంక్షోభంలో అల్లాడిపోతున్న ప్రపంచ దేశాలకు ఇరాన్ తియ్యని కబురు వినిపించింది. అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హార్మజ్ జలసంధి విషయంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. హార్మజ్ ను పూర్తిగా తెరిచినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో అమలవుతున్న

అఖండ భూమి

శనివారం 18- 04 - 2026

# లోక్ సభలో మహిళా బిల్లు వీగిపోవడానికి పూర్తి బాధ్యత బీజేపీదే

**మొదటిపేజీ తరువాయి** – వల్లే దేశంలోని మహిళా లోకానికి దక్కాల్సిన రిజర్వేషన్లు వెంటనే దక్కకుండా పోయాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ సహా దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు పలికినప్పటికీ, బీజేపీ కావాలనే డీలిమిటేషన్ పేరుతో చిక్కుముళ్లు తెచ్చిపెట్టి బిల్లు విఫలమయ్యేలా చేసిందని ఆరోపించారు. మహిళా సాధికారతపై బీజేపీకి ఉన్న చిత్తశుద్ధి నేటి పరిణామాలతో తేలిపోయిందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అనవసరంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంతో ముడిపెట్టడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లతోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేసి ఉంటే ఎటువంటి సమస్య వచ్చేది కాదని, కానీ మహిళల రిజర్వేషన్ల అంశాన్ని ముడిపెట్టి దేశ మహిళల భుజాల మీద నుంచి దక్షిణాది రాష్ట్రాల గొంతు కోయాలని బీజేపీ చూసిందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను, డీలిమిటేషన్ పర్యవసానాలను పట్టించుకోకుండా మొండిగా ముందుకు పోవడంతో ఒక చారిత్రక అవకాశం జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**బీజేపీ రాజకీయ స్వార్థానికి మహిళలు బలి**

మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ ఆడిన నాటకాన్ని దేశ ప్రజలు కళ్లారా చూశారని కేటీఆర్ అన్నారు. కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం మహిళలను వాడుకుని, ఇప్పుడు వారిని వెన్నుపోటు పొడిచిన పార్టీగా బీజేపీ చరిత్రలో నిలిచిపోతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా బీజేపీ తన నిజాయతీని నిరూపించుకోవాలంటే, డీలిమిటేషన్ నిబంధన లేకుండా కేవలం మహిళా రిజర్వేషన్ల కోసమే ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల నుంచే దాన్ని అమలు చేయాలని అన్నారు. దేశంలోని అనేక పార్టీలు డీలిమిటేషన్ అనే అంశం అత్యంత సంక్లిష్టమైనదని చెప్పాయని తెలిపారు. ప్రస్తుత విధానంలో దక్షిణ భారతదేశానికి పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గడం ప్రమాదకరమని స్పష్టంగా చెప్పిన విషయాన్ని బీజేపీ గుర్తించాలని అన్నారు. ఇప్పటికైనా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని డీలిమిటేషన్ అంశంపై విస్తృతమైన చర్చ, సంప్రదింపులు చేపట్టాలని సూచించారు. డీలిమిటేషన్ అంశంపై మొండిగా ముందుకుపోవడం కుదరదనే విషయం ఈరోజు లోక్ సభలో జరిగిన పరిణామాలను బట్టి బీజేపీ తెలుసుకోవాలని అన్నారు. దీనితో పాటు తెలంగాణ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల పెంపు అనేది మా రాష్ట్ర హక్కు అని కేటీఆర్ అన్నారు. జమ్ము కశ్మీర్, అసోంలో దేశవ్యాప్త డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా సీట్ల పెంపు చేపట్టిన కేంద్రం, తెలంగాణ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. మహిళా బిల్లుతో, దేశవ్యాప్త డీలిమిటేషన్ అంశం సంబంధం లేకుండా, తెలంగాణ అసెంబ్లీ సీట్లను 2028 లోపు పెంచేలా ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రత్యేక బిల్లు తీసుకురావాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులకు బ్రేక్

**మొదటిపేజీ తరువాయి** – సాధించడంలో విఫలమైంది. రెండు రోజుల పాటు జరిగిన వాడీవేడి చర్చ అనంతరం జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. సాధారణ మెజారిటీ లభించినప్పటికీ, రాజ్యాంగ సవరణకు తప్పనిసరి అయిన ప్రత్యేక మెజారిటీని పొందలేకపోవడంతో బిల్లు ఓటమి పాలైంది. ఈ బిల్లు ద్వారా లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాలను 850కి పెంచాలని, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేశాక ఈ పెంపును అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనితో పాటే, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 33 శాతం మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. బిల్లుపై జరిగిన చర్చలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా బలంగా తమ వాదనలు వినిపించారు. ఓటర్లు, ప్రజాప్రతినిధుల మధ్య నిష్పత్తిలో ఉన్న అసమానతను సరిదిద్దాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి అని ప్రభుత్వం పేర్కొంది. మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రతిపక్షాల వైఖరిని దేశంలోని మహిళలందరూ గమనిస్తున్నారని హెచ్చరించారు. నియోజకవర్గాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా అడ్డుకుంటూ వస్తోందని, ఇప్పుడు కూడా అదే పనిచేస్తోందని అమిత్ షా ఆరోపించారు. అయితే, ప్రభుత్వ వాదనను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. మహిళా సాధికారత అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం రాజకీయ ఎత్తుగడకు పాల్పడుతోందని విమర్శించాయి. ఈ బిల్లు ఆమోదం పొందితే, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న ఉత్తర భారత రాష్ట్రాలకు రాజకీయంగా ప్రయోజనం చేకూరుతుందని, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. దక్షిణాది రాష్ట్రాల గొంతును అణచివేసే ప్రయత్నమే ఈ బిల్లు అని విపక్షాలు ఆరోపించాయి. ఈ కీలక బిల్లు ఓటమి పాలవడంతో, దీనితో ముడిపడి ఉన్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మహిళా కోటాను విస్తరించే సవరణ బిల్లులను కూడా ముందుకు తీసుకువెళ్లబోమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ఈ ఓటమి మోదీ ప్రభుత్వ శాసనపరమైన రికార్డులో ఒక అరుదైన వైఫల్యంగా నిలిచిపోతుంది. అదే సమయంలో, తమ వాదనకు విజయం లభించిందని ప్రతిపక్షాలు భావిస్తున్నప్పటికీ, చట్టసభల్లో అడుగుపెట్టాలని ఆశిస్తున్న మహిళలకు మాత్రం రిజర్వేషన్ల కోసం నిరీక్షణ మరింత పెరిగింది. ఈ పరిణామంతో మహిళా రిజర్వేషన్ల భవిష్యత్తు మళ్లీ అనిశ్చితిలో పడింది.

# విమర్శల నుంచి విజయ శిఖరం వరకు.. లోకేష్ రాజకీయ ప్రస్థానం ఇదే..!

**మొదటిపేజీ తరువాయి** – రాజకీయ పునాది ఉంది. వారసత్వంతో రాజకీయాల్లోకి రావాలా? వ్యక్తిగత ప్రతిభా సామర్థ్యాలతో ప్రజల్లోకి వెళ్లాలా? అనే ప్రశ్నలు లోకేశ్ ను తర్జనభర్జనకు గురిచేశాయి. అపారమైన అవకాశాలున్నాయి.. కొడుకు నాయకుడిగా ఎదిగేస్తాడని చంద్రబాబు పొరపాటున కూడా భావించలేదు.. కొడుకు లోకేశ్ ఎదుగుదలకు చంద్రబాబు ఎత్తుగడ మంచి ఫలితాన్నిచ్చింది. లోకేశ్ రాజకీయాల్లోకి రావాలనే భావన.. పార్టీ నాయకులు, కార్యకర్తల్లో కల్పించారు. కార్యకర్తల అభ్యర్థనతోనే లోకేశ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టేలా చేశారు. ఆంధ్రప్రదేశ్ మనుగడలో తెలుగుదేశం పార్టీ ఓ సంచలనం. సినీ గ్లామర్ తో తాత ఎన్టీఆర్ స్థాపించిన రాజకీయపార్టీతో ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. జాతీయ రాజకీయాలను తెలుగుదేశం పార్టీ ప్రభావితం చేసే విధంగా ఎదిగింది. ఎన్టీరామారావు వ్యక్తిగత పలుకుబడి... సినీగ్లామర్...రాజకీయాల్లో రాణించిన తీరు...అనుసరించిన విధానాలు ప్రజల్లో ప్రత్యేక ముద్రవేసుకున్నారు. సంవత్సరాలు కాదు...దశాబ్దాలు గడిచినా.. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాల గురించి మాట్లాడాలంటే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం ముందు... ఆ తర్వాత... అనే ప్రస్తావన తీసుకొస్తారు. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీరామారావు సెన్సేషన్ క్రియేట్ చేశారు. 1984 ఎన్నికల్లో కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యానికి పాతరవేశారు. సరికొత్త రాజకీయాలకు బీజం వేశారు. ఎన్టీరామారావు చరిష్మతో 1994 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించింది. 1994 అసెంబ్లీ ఎన్నికలకు ముందుగా చోటుచేసుకున్న పరిణామాలతో ఎన్టీరామారావు అల్లుడు చంద్రబాబు నాయడు పార్టీ పగ్గాలను చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చంద్రబాబు చక్రం తిప్పారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ రోజుల్లోనే పుట్టిన లోకేశ్ ను విద్యావంతుడిగా తీర్చిదిద్దే ప్రయత్నంలో చంద్రబాబు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ప్రాథమిక విద్యాభ్యాసం హైదరాబాద్ లోనే సాగింది. విద్యావంతుడిగా... ప్రతిభావంతుడిగా రాణించాలని లోకేశ్ ను అమెరికాలోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో చదివించారు. అక్కడే నందమూరి బాలకృష్ణ కుమార్తె బ్రాహ్మణితోపాటు... అమెరికాలోనే ఉండి చదువుకున్నారు. 2000-2004 సంవత్సరాల మధ్య అమెరికాలోని కార్నెగీ మెల్లన్ యూనివర్శిటీలో డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ బిజినెస్ లో మాస్టర్ డిగ్రీ పూర్తిచేశారు. మేనరికమే కాదు... చిన్నప్పటి నుంచి కలిసి మెలసి ఎదిగిన బ్రాహ్మణి, లోకేశ్ బాబులకు వివాహం జరిపించారు. దీంతో ఎన్టీఆర్ కుటుంబంతో చంద్రబాబు కుటుంబానికి మరింత బంధాన్ని ఏర్పరచింది. చదువు పూర్తయ్యాక వ్యాపార కార్యకలాపాల్లో రాణించాలా? రాజకీయాల్లో రాణించాలా? అనే ప్రశ్నలు చంద్రబాబునాయుడిని ఇబ్బందిపెట్టాయి. అందుకే.. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న మంత్రి నారా లోకేశ్‌కు పదోన్నతి లభించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా,... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయడు... కొడుకు లోకేశ్ ఎదుగుదలపట్ల ఆనందానుభూతికి లోనయ్యారు. లోకేశ్ పనితీరును మెచ్చుకుంటున్న నాయకులు, ప్రజల ఆదరణ అభిమానానికి చేరువైన లోకేశ్ ప్రస్థానంతో చంద్రబాబు పుత్రోత్సాహంతో అమితానంద భరితులయ్యారు. రాజకీయాల్లో ఎదగాలనుకున్న యువకులు... లోకేశ్ రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని భావిస్తున్నారు. డబ్బుంటేనే అన్నీ సాధ్యం కావు. ప్రజలతో మమేకం కావాలి.... ప్రజల అవసరాలను తీర్చాలి... అంకితభావం, జవాబుదారీతనంతో ఉంటే ప్రజలే పదవులిస్తారని లోకేశ్ నిరూపించారు. కార్యకర్త స్థాయి నుండి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ స్థాయికి ఎదుగుతూ, పార్టీని, నాయకత్వాన్ని బలోపేతం చేయడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారు. 2029 లక్ష్యంగా రాబోయే ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించడమే లక్ష్యంగా ఆయన బాధ్యతలు చేపట్టారు. దేశ రాజకీయాల్లో లోకేశ్ బాబు మరింత ఉన్నతంగా రాణించాలని ఆశిద్దాం..

# మేడిగడ్డ బ్యారేజీ పునరుద్దరణ పనులు

**మొదటిపేజీ తరువాయి** – శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి బ్యారేజీల ప్రస్తుత స్థితిగతులపై అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. బ్యారేజీల పునరుద్ధరణ పనుల కోసం ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీ కన్వీనర్ కల్నల్ పరీక్షిత్ మెహ్రాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. బ్యారేజీల తనిఖీలు, బోరు బావుల తవ్వకాలు, పనుల వేగాన్ని పెంచడానికి తీసుకున్న చర్యల పురోగతి గురించి ఆయన ఆరా తీశారు.

ప్రభుత్వానికి ఎటువంటి మాట రానివ్వకూడదు : ఈ మేరకు మేడిగడ్డ బ్యారేజీ వద్ద బోర్ల తవ్వకాల పనులు ఈ నెల చివరి నాటికి ఊపందుకొంటాయని కల్నల్ పరీక్షిత్ వివరించినట్లు తెలిసింది. పునరుద్ధరణ పనుల వేగాన్ని ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉద్ఘాటిస్తూ తాత్కాలిక చర్యలకు పాల్పడటం లేదా పనులను అసంపూర్ణంగా వదిలేయడం వంటివి చేయకూడదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రభుత్వానికి ఎటువంటి మాట రానివ్వద్దని, ఇబ్బందులకు ఎలాంటి తావు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావాలి : గత ప్రభుత్వం ఇలాంటి నిర్లక్ష్యపూరిత పనులు చేసి అనేక తప్పిదాలు చేయడం వల్లే ఈ బ్యారేజీలు నిరుపయోగంగా ఉండిపోయాయని రేవంత్ పేర్కొన్నారు. ఇటువంటి తప్పులు మళ్లీ జరగకుండా చూసుకోవాలని, బ్యారేజీలను చాలా పకడ్బందీగా పునరుద్ధరించి వాటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శులు శ్రీధర్, సందీప్?కుమార్? సుల్తానియా, రామగుండం సీఈ శ్రీనివాస్ గుప్తా, మాణిక్ రాజ్, ఇతర ఇంజినీర్లు పాల్గొన్నారు.

మేడిగడ్డకు వెళ్లి పరిశీలించనున్న బీఆర్ ఎస్ పార్టీ నేతలు : ఇదిలా ఉండగా మేడిగడ్డ ఆనకట్ట మరమ్మతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు అక్కడకు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లనున్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన పార్టీ నేతలు కొందరు శనివారం రోజున మేడిగడ్డ ఆనకట్టను పరిశీలించనున్నారు. ఈ నెల 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనకు వెళ్లనున్నారు. ఆనకట్ట మరమ్మతుల ప్రక్రియను పరిశీలించనున్నారు. దాంతో రెండు రోజుల ముందే అక్కడకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు.


పునరుద్ధరణ పనుల కోసం స్టీరింగ్ కమిటీ ఏర్పాటు : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీల పునరుద్ధరణ పనులు వేగం పెంచడానికి ప్రభుత్వం దృష్టి పెట్టింది. రూ.వేల కోట్ల విలువైన సాగునీటి పథకాన్ని అతి త్వరలో వినియోగంలోకి తీసుకొచ్చేలా కసరత్తు చేస్తోంది. దానికి తగ్గట్టుగా బ్యారేజీల పునరుద్ధరణకు పరీక్షిత మెహ్రా నేతృత్వంలో స్టీరింగ్? కమిటీ ఏర్పాట్లు చేసినట్లు ఇటీవల ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు. మేడిగడ్డను కనీసం పాక్షికంగానైనా ఉపయోగంలోకి తేవాలని మంత్రి తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, విజిలెన్స్ కమిషన్ తదితర చట్టబద్ధ సంస్థలు ఇప్పటికే మూడు బ్యారేజీల డిజైన్, ఫౌండేషన్, ప్రణాళిక, అమలు అంశాల్లో ఎన్నో లోపాలను గుర్తించాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. నిర్మాణ సంస్థలు ఈ విషయంలో ఏవైనా సందేహాలుంటే నీటిపారుదలశాఖ కార్యదర్శి శ్రీధర్, కర్నల్ పరీక్షిత్ మెహ్రాతో నిరంతరం 45 రోజులపాటు నిరంతరం పరీక్షలు నిర్వహించేలా బ్యారేజీల ప్రాంతాల్లోనే ఉండాలన్న మంత్రి ఉత్తమ్ వారికి నిర్మాణ సంస్థలు పూర్తి సహకారం అందించాలని నిర్దేశించారు.

# మైక్రో ఫైనాన్స్ కేసులో కింగ్ పిన్ మంగ్లీ..?..

**మొదటిపేజీ తరువాయి** – రమావత్ మధును అరెస్ట్ చేశారు. ముఖ్యంగా గోకులనందన, శుభ క్షేత్ర ప్రాజెక్ట్స్ పేరుతో వందల కోట్లను మధు గ్యాంగ్ వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. మైక్రో ఫైనాన్స్ వ్యాపారాల వెనుక మంగ్లీ ని చూపించి రమావత్ మధు బిజినెస్ చేసినట్లు చెప్తున్నారు. మంగ్లీ కోకపేట నివాసంలోనే మధు మైక్రో ఫైనాన్స్ కార్యకలాపాలు జరిగినట్లు సమాచారం. మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ తో కలిసి బాధితుల దగ్గర కోట్లు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పబ్బులు, స్కూల్స్, వెంచర్స్ అంటూ అమాయకులకు మధు మాయమాటలు చెప్పాడు. మంగ్లీ సోదరికి కాబోయే భర్త తానే అంటూ మధు ప్రచారం చేసుకున్నాడు. మరోవైపు మంగ్లీ మాత్రం దీన్ని ఖండించి, తన కుటుంబం జోలికి వెళ్లవద్దని స్పష్టం చేసింది. నిందితులు మధు, భరత్, శైలజ లతో కలిసి విల్లాల కన్ స్ట్రక్షన్ను చేపడుతున్నట్లు ప్రచారం చేశారు. రమావత్ మధు పేరు బయటకి రాకుండా బాధితులు హిమ కాంత్ రెడ్డి, న్యాయవాది సుబ్బారావు పైన మంగ్లీ ఫిర్యాదులు చేసింది. వెంచర్లు స్టార్ట్ చేయకుండా బ్రోచర్స్ తో మోసాలకు తెరతీశారు.ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో వందల మంది మైక్రో ఫైనాన్స్ బాధితులు ఉన్నారు. మరోవైపు లాయర్ మాత్రం మంగ్లీ విక్టిమ్ కార్డు ప్లే చేస్తుందని తనపై ఫిర్యాదు చేస్తుందని కానీ బాధితులపై కేసులను ఎందుకు పెట్టడంలేదన్నారు. బంజారా మహిళ అని, మీడియా నుంచి వచ్చానని, తన ఫ్యామిలీ అంటూ ఏడుచుకుంటూ విక్టిమ్ కార్డు ప్లే చేస్తుందని లాయర్ సుబ్బు వ్యాఖ్యలు చేశారు. అయితే.. దీని వెనకాల మంగ్లీ కీ రోల్ ప్లే చేసిందని వార్తలు నెట్టింట ప్రచారం అవుతున్నాయి. దీనిపై మాత్రం పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు.

# ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త...

**మొదటిపేజీ తరువాయి** –



కాల్పుల విరమణ కొనసాగినంత కాలం, ఈ జలసంధి గుండా అన్ని రకాల వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతి ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ శుక్రవారం అధికారికంగా వెల్లడించారు. "లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందానికి అనుగుణంగా, ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ పోర్ట్స్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్ ఇప్పటికే ప్రకటించిన సమన్వయ మార్గంలో, మిగిలిన కాల్పుల విరమణ కాలానికి హర్మూజ్ జలసంధి గుండా అన్ని వాణిజ్య నౌకల ప్రయాణానికి మార్గం పూర్తిగా తెరిచి ఉంటుంది" అని మంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ చమురు వాణిజ్యంలో హర్మూజ్ జలసంధి అత్యంత వ్యూహాత్మకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ తాజా నిర్ణయం వాణిజ్య వర్గాలకు ఊరటనిస్తోంది. అయితే, నౌకలు తమ దేశ మారిటైమ్ సంస్థ నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణించాలనే షరతును ఇరాన్ విధించింది. లెబనాన్‌లో శాంతియుత వాతావరణం కొనసాగేలా చూసే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# వీగిపోయిన మహిళా రిజర్వేషన్ బిల్లు...

**మొదటిపేజీ తరువాయి** – ఈ మేరకు ఆమె ఒక వీడియోను విడుదల చేశారు. బీజేపీ దేశ ప్రజలను మరోసారి మోసం చేసిందని కవిత మండిపడ్డారు. అన్నీ తెలిసే బీజేపీ ఈ బిల్లును ప్రవేశపెట్టిందని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజనను మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపెట్టడం వల్ల ప్రతిపక్షాలు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తాయని అధికార పార్టీకి ముందే తెలుసని అన్నారు. అయినప్పటికీ ఈ బిల్లులను కలిపి తీసుకువచ్చిందని అన్నారు. తమకు అవసరమైన సంఖ్యాబలం లేదని తెలిసినప్పటికీ ప్రభుత్వం ఈ బిల్లును హడావుడిగా ప్రవేశపెట్టిందని ఆరోపించారు. భారత మహిళల భావోద్వేగాలను బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుందని ధ్వజమెత్తారు. మహిళలందరూ ఈ మోసాన్ని గుర్తించి, బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఒక మహిళ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్నారని, కాబట్టి బీజేపీ పతనాన్ని అక్కడి నుంచి ప్రారంభించాలని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని దీని ద్వారా నిరూపితమైందని అన్నారు. బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆడబిడ్డలు కూడా బీజేపీ చేసిన మోసాన్ని గుర్తించాలని అన్నారు. బెంగాల్‌లోని మీ స్నేహితులు, సన్నిహితులకు మమతా బెనర్జీకి ఓటు వేసి గెలిపించాలని చెప్పాలని కోరారు.

# రాజ్యాంగంపై దాడిని అడ్డుకున్నాం

**మొదటిపేజీ తరువాయి** – ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 వీగిపోయింది. శుక్రవారం సభలో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో ఓటమి పాలైంది. విపక్ష 'ఇండియా' కూటమి సభ్యులు ఐక్యంగా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో ఉన్న సభ్యులలో మూడింట రెండొంతుల మంది, అంటే 358 మంది సభ్యుల మద్దతు అవసరం. కానీ, ప్రభుత్వానికి 60 ఓట్లు తక్కువయ్యాయి. మహిళా రిజర్వేషన్ల అమలును భవిష్యత్తులో చేపట్టే డెలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియతో ముడిపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ ఓటమిపై లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ, ఇది రాజ్యాంగం సాధించిన విజయమని అభివర్ణించారు. "సవరణ బిల్లు పడిపోయింది. మహిళల పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి వారు రాజ్యాంగ విరుద్ధమైన ఉపాయాన్ని ఉపయోగించారు. భారతదేశం అది గమనించింది. 'ఇండియా' కూటమి దానిని ఆపింది. రాజ్యాంగానికి జై" అని ఆయన పేర్కొన్నారు. ఇది మహిళలకు సంబంధించిన బిల్లు కాదని, డీలిమిటేషన్ పేరుతో దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర అని ఆయన ఆరోపించారు. మరోవైపు, ఓటర్లు, ఎంపీల మధ్య నిష్పత్తిలో ఉన్న అసమతుల్యతను సరిదిద్దడానికే డీలిమిటేషన్ అవసరమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వాదించారు. సవరణ బిల్లు ఓటమితో, దీనికి సంబంధించిన మరో రెండు బిల్లులను కూడా ముందుకు తీసుకెళ్లబోమని ప్రభుత్వం ప్రకటించింది.

# హర్మూజ్ తెరిచినందుకు ఇరాన్ కు థాంక్స్ చెప్పిన ట్రంప్... కానీ!

**మొదటిపేజీ తరువాయి** – సిద్ధంగా ఉందని, అందుకు ఇరాన్ కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని, అయితే ఇరాన్‌తో తమ ఒప్పందం 100 శాతం పూర్తయ్యే వరకు ఆ దేశంపై సైనిక దిగ్బంధం కొనసాగుతుందని ఆయన తెలిపారు. చాలా అంశాలపై ఇప్పటికే చర్చలు జరిగాయని, ఈ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు, లెబనాన్‌లో కాల్పుల విరమణకు అనుగుణంగా హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల కోసం పూర్తిగా తెరిచినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ప్రపంచంలోనే కీలకమైన ఈ జలమార్గం తిరిగి తెరుచుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు ఒక్కసారిగా తగ్గాయి. అయితే, అమెరికా తన సైనిక వైఖరిని మార్చుకోలేదు. ఈ దిగ్బంధంలో భాగంగా 10,000 మందికి పైగా సైనికులు, డజనుకు పైగా యుద్ధ నౌకలు, విమానాలు పాల్గొంటున్నాయని అమెరికా సైనిక అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఇంకా పూర్తిగా చల్లారలేదు. ఒకవైపు దౌత్యపరమైన చర్చలు జరుగుతుండగానే, మరోవైపు ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని కొనసాగించడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది. పర్షియన్ గల్ఫ్‌ను ఒమన్ గల్ఫ్‌తో కలిపే హర్మూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైనది.

# మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ మాయోపాయం పారలేదు: షర్మిల

**మొదటిపేజీ తరువాయి** – బీజేపీ కుతంత్రాలకు పాల్పడిందని, అయితే వారి మాయోపాయం ఫలించలేదని ఆమె వ్యాఖ్యానించారు. ఇది ఎన్డీఏ అధర్మంపై ఇండియా కూటమి సాధించిన ధర్మయుద్ధ విజయమని, ప్రజాస్వామ్యం నిలబడిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "విఫలమైంది అతి గతి లేని డీలిమిటేషన్ బిల్లే తప్ప, మహిళా రిజర్వేషన్ బిల్లు కాదు. మహిళా బిల్లుకు 2023లోనే ఆమోదం లభించింది. విపక్షాలు ఎన్నడూ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రను మాత్రమే ప్రతిపక్షాలు తిప్పికొట్టాయి" అని స్పష్టం చేశారు. మహిళల పేరుతో నీచ రాజకీయాలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి, బీజేపీకి ఇది చెంపపెట్టు లాంటిదని ఆమె ఘాటుగా విమర్శించారు. సాధికారత పేరుతో సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయాలనే బీజేపీ కుయుక్తులు చెల్లలేదని అన్నారు. ఇది భారతదేశ ప్రజల విజయమని, బీజేపీ రాజకీయ దురుద్దేశానికి ఇది చరమ గీతమని అభివర్ణించారు. ప్రతిపక్షాలపై బురదజల్లడం మాని, మహిళలపై చిత్తశుద్ధి ఉంటే 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. దేశంలోని 543 లోక్‌సభ స్థానాల్లో వెంటనే 33 శాతం రిజర్వేషన్లు కల్పించి, తమ నిజాయతీని నిరూపించుకోవాలని బీజేపీకి సవాల్ విసిరారు.

# మహిళా బిల్లును వ్యతిరేకించి ఏం సాధించారు?

**మొదటిపేజీ తరువాయి** – సవరణ బిల్లును పార్లమెంటులో వ్యతిరేకించిన పార్టీలు తాము ఏం సాధించాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. ఈ బిల్లు ఆమోదం పొందకపోవడం వల్ల మహిళలకు, దక్షిణ భారత రాష్ట్రాలకు ఏకకాలంలో అన్యాయం జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2026కు మూడింట రెండొంతుల మెజారిటీ లభించని నేపథ్యంలో జగన్ ఎక్స్ వేదికగా స్పందించారు. 2026 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) చేపడితే దక్షిణ రాష్ట్రాల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. అసలు వాళ్లు ఏం సాధించారు? వాస్తవ పరిస్థితి చూస్తే, దక్షిణాది రాష్ట్రాల సంఖ్యాబలం (సీట్లు) తగ్గిపోతుంది, మరోవైపు మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా వాయిదా పడింది. దీనివల్ల దక్షిణాదికి న్యాయం జరగలేదు, మహిళలకూ న్యాయం అందలేదు. ఒకవేళ 2026లో జనాభా లెక్కలు తీస్తే, దక్షిణాది పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. కుటుంబ నియంత్రణ విషయంలో ఎంతో క్రమశిక్షణతో వ్యవహరించినందుకు దక్షిణాది రాష్ట్రాలను మరింతగా శిక్షించినట్లు అవుతుంది. జనాభాను నియంత్రించిన పాపానికి మా ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ఎంతవరకు సమంజసం? ఇది దక్షిణాదిపై చూపిస్తున్న వివక్ష కాదా? రాజకీయ పార్టీలు ఈ అన్యాయంపై ఎందుకు మౌనంగా ఉంటున్నాయో అర్థం కావడం లేదు" అని జగన్ ట్వీట్ చేశారు.

# పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు...

**మొదటిపేజీ తరువాయి** – అదుపులోకి తీసుకున్నారు. హాస్యం పేరుతో సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఈ ఘటనలు తీవ్ర చర్చకు దారితీశాయి. గత కొంతకాలంగా పవన్ వైవాహిక జీవితం, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచేలా కొందరు సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్‌తో పాటు రామ్ చరణ్, ఉపాసన, నారా లోకేశ్, నందమూరి బాలకృష్ణలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనుదీప్ కటికలను కాకినాడ పోలీసులు ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేశారు. ఈ ఘటన మరువక ముందే రఫీక్ మొహమ్మద్ అనే కమెడియన్ గతంలో చేసిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. పవన్ ముగ్గురు భార్యల గురించి, ముఖ్యంగా ఆయన భార్య అన్నా లెజినోవా గురించి రఫీక్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయి. ఈ వ్యాఖ్యలు సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని జనసేన నేత సాయన శివనారాయణ మచిలీపట్నంలోని చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం రాత్రి విశాఖపట్నంలోని రఫీక్ నివాసానికి వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పుడు కేవలం సినీ నటుడు మాత్రమే కాదు, రాష్ట్ర డిప్యూటీ సీఎంగా కీలక హోదాలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే రాజకీయ ప్రత్యర్థుల ప్రోద్బలంతోనే ఈ కమెడియన్లు వరుసగా దాడులకు దిగుతున్నారని కూటమి మద్దతుదారులు ఆరోపిస్తున్నారు.

# మీకు మహిళల ఉసురు తగులుతుంది

**మొదటిపేజీ తరువాయి** – విరుచుకుపడ్డారు. భవిష్యత్ ఎన్నికల్లో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని, వారి ఉసురు మీకు తగులుతుందని హెచ్చరించారు. బిల్లును తిరస్కరించడం మహిళలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. బిల్లు వీగిపోయిన అనంతరం గెలిచామంటూ నినాదాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ఇది తిరస్కరణకు గురైంది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కావడంతో ఇది వీగిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఓటింగ్ సమయంలో సభలోనే ఉన్నారు. ఈ పరిణామంపై అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు మహిళా వ్యతిరేక వైఖరితో బిల్లును అడ్డుకున్నాయని ఆరోపించారు. డీలిమిటేషన్ విషయంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనివల్ల దక్షిణ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని

అఖండ భూమి
శనివారం 18- 04 - 2026

## గంధ అమావాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు




**అనకాపల్లి జిల్లా నాతవరం మండలం ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** అనకాపల్లి జిల్లా నాతవరం గ్రామ శివారు ఏకే అగ్రహారంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండగ గంధ అమావాస్య సందర్భంగా ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణంలో విద్యుత్ కాంతులు వెదజల్లే విధంగా అమ్మవారి గుడికి హంగులు ఏర్పాటు చేసి భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను పూర్తిచేసి వేకూజాము నుండి భక్తులకు దర్శనార్థం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు అభిషేకంలో నిర్వహించి అమ్మవారి ప్రసాదం స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు ఈ కార్యక్రమం గ్రామ ప్రజలు పెద్దలు సహకారంతో జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు

## పవన్ కళ్యాణ్ ను విమర్శించే స్థాయి మీ కు లేదు.: కాపునాడు అధ్యక్షులు ఇటికింటి మహేష్



**ధర్మవరం ( ఏబీ నెట్వర్క్ ) ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ను విమర్శిస్తే పబ్లిసిటీ వస్తుందని, అనుకోవడం పొరపాటేనని, అతని విమర్శించే స్థాయి మనకుందా లేదని ప్రశ్నించుకోవాలని కాపునాడు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఇటికింటి మహేష్ వారిపై ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బోడిగుండు రామచంద్రం యాదవ్ బీసీ లను మోసం చేస్తూ దొంగ దీక్షకు దిగి సోషియల్ మీడియాలో హంగామా చేస్తూ ఆయన వ్యక్తిగత స్వలాభ దీక్ష చేస్తుంటే కొంతమంది పక్క రాష్ట్రం బిక్షగాళ్లు ఆయన విసిరే చిల్లరకు అమ్ముడుపోయి పవన్ కళ్యాణ్ ని వ్యక్తిగతంగా దూషిస్తే తక్కువకాలంలోనే సమాజంలో గుర్తింపు,పేరు వస్తుందని తప్పుడు విమర్శలు చేస్తున్నారనీ, ఆ కోవకు చెందినవాడే ఈ అంబర్ పేట్ శ్రీనివాస్ యాదవ్ అని తెలిపారు. అంబర్ పేట్ శ్రీనివాస్ కాదు ఆంబోతు శ్రీనివాస్ అని అతనికి నామకరణం చేస్తున్నామని, బోడిగుండు రామచంద్రం కి రాజకీయ బిక్ష పెట్టింది పవన్ కళ్యాణ్ అనీ అదే విధంగా 2019 పుంగనూరు జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తే నీ నాయకునికి ఎన్ని ఓట్లు వచ్చాయి అదేవిదంగా నీ నాయకుడు సొంతంగా పార్టీ పెట్టుకుంటే ఎన్ని ఓట్లు వచ్చాయి విమర్శించే ముందు నీ స్థాయి స్థోమత ఆలోచించుకొని మాట్లాడాలని సూచించారు.ఇంకొక్కసారి పవన్ కళ్యాణ్ ని వ్యక్తిగతంగా దూసిస్తే జనసేన నాయకులు, పవన్ అభిమానులు, నీ రాష్ట్రం లోకి వచ్చి నీ కథ తెలుస్తారని తెలిపారు. ఎటువంటి లాభాపేక్ష లేని నాయకుడు పవన్ కళ్యాణ్ అనీ కేవలం మన రాష్ట్ర అభివృద్ధి కోసమే పని చేస్తున్నారని, ఆయన విమర్శించే స్థాయి మీకు మీ నాయకులకు లేదని తెలిపారు.



## ప్రత్యేక అలంకరణలో చింతలూరు శ్రీ నూకాంబికా అమ్మవారు

**ఆలమూరు,ఏప్రియల్ 17(అఖండ భూమి న్యూస్):**అమావాస్య శుక్రవారం పర్వదినం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో చింతలూరు శ్రీ నూకాంబికా అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకున్నారు.

## మలేరియా జ్వరాల ప్రబలకుండా గ్రామాల్లో స్ప్రేయింగ్ ప్రారంభం

వైద్యాధికారి జగదీష్ నాయక్





**కొయ్యూరు, అల్లూరి జిల్లా ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** వాతావరణంలో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నందున ఏజెన్సీలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామాల్లో ముమ్మరంగా మలేరియా స్ప్రేయింగ్ చేపడుతున్నట్టు రాజేంద్రపాలెం పి హెచ్ సి వైద్యాధికారి జగదీష్ నాయక్, సబ్ యూనిట్ అధికారి నూకరాజు లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కొయ్యూరు మండలంలోని చింతవానిపాలెం,రాజేంద్రపాలెం గ్రామాల్లో మలేరియా స్ప్రేయింగ్ ఇంటింటికి వెళ్లి స్ప్రేయింగ్ ప్రారంభం చేసినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ మరియు ఐటిడిఏ ప్రాజెక్టు అధికార్లు, డి ఎం అండ్ హెచ్ ఓ ఆదేశాల మేరకు కొయ్యూరు మండలంలోని అన్నీ మారుమూల గ్రామాల్లో సైతం సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు వైద్యాధికారి జగదీష్ నాయక్ తెలిపారు. అన్ని పి హెచ్ సి పరిధిల్లో ఉన్న గ్రామాల్లో నెల రోజుల పాటు ఈ మలేరియా స్ప్రేయింగ్ చేపడుతున్నట్టు సబ్ యూనిట్ అధికారి తెలిపారు. గ్రామాలకు వచ్చి ఇంటింటా ఈ స్ప్రేయింగ్ చేపడుతున్నట్టు సిబ్బందికి గ్రామస్తులు, కుటుంబాల వారిగా సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నూకరాజు, పి హెచ్ ఎన్ భాగ్యవతి, హెచ్ వి భూలోక, హెల్త్ అసిటెంట్స్, ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## కార్యకర్తను ప్రజాప్రతినిధిగా చేయడమే టీ.డీ.పీ పార్టీ లక్ష్యం ఎమ్మెల్యే..గిత్త...!!




**నందికొట్కూరు ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం నందికొట్కూరు పట్టణంలో టి.డి.పి పార్టీ కార్యాలయం నందు,కూటమి నాయకులతో కలిసి,కార్యకర్తల సమావేశం నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త.జయసూర్య నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త.జయసూర్య మాట్లాడుతూ కార్యకర్తను ప్రజా ప్రతినిధిగా చేయాలనేది టీ.డీ.పీ లక్ష్యమని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దానిని రుజువు చేసేలా కార్యకర్తలను స్థానిక ఎన్నికల్లో గెలిపించి మన సత్తా చాటాలని,గౌరవనీయులు నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర.శివానందరెడ్డి నందికొట్కూరు టి.డి.పి ఇన్చార్జి గౌరు.వెంకట్ రెడ్డి నాయకత్వంలో అందరూ కలసికట్టుగా పనిచేయాలని సూచించారు.రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే గిత్త.జయసూర్య అన్నారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణ కూటమి నాయకులు,కార్యకర్తలు,పాల్గొనడం జరిగింది.


## మహిళాల భద్రత పట్ల పోలీస్ శాఖ పోస్టర్లతో ప్రచారం



**కొయ్యూరు, అల్లూరి జిల్లా ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** మహిళల రక్షణ పట్ల ప్రతి ఒక్కరూ సత్ ప్రవర్తన కలిగి ఉండి తగిన భద్రత కల్పించడానికి తోడ్పడాలని కోరుతూ పోలీసుల ఆధ్వర్యంలో ముమ్మరంగా అవగాహన ప్రచారం కల్పిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధన్, కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ ఐ కిషోర్ వర్మ ఆదేశాల పై మహిళల భద్రతకు, తగిన రక్షణ కు పోలీసు శాఖ పోస్టర్లు ద్వారా పలు ప్రధాన కూడలి వద్ద, పెట్రోల్ బంకులు, బస్ స్టేషన్లు, స్టాప్ లు, వ్యాపార సెంటర్లు వద్ద మహిళాల భద్రత కు సంభంధించిన పోస్టర్స్ ను అతికించి ముమ్మరంగా అవగాహన ప్రచారం కల్పిస్తున్నారు. స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రసన్న కుమార్ కొయ్యూరు, కాకరపాడు తదితర ప్రాంతాల్లో ఈ పోస్టర్లు ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రసన్న మహిళాల పట్ల అసాంఘిక కార్యక్రమాలు పాల్పడినా, అసత్య ప్రవర్తన కు పాల్పడిన, దుర్భాషలాడిన అధికార్లు ఆదేశాల పై చర్యలు తప్పవని సూచించారు.

## వృద్ధాప్య.వితంతువు వికలాంగులు ఒంటరి మహిళ తదితర పెన్షన్లను తక్షణమే మంజూరు చేయాలి.....!!

సి.పి.ఐ (ఎం.ఎల్ )లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి.వెంకటేశ్వర్లు



**నందికొట్కూరు ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** నంద్యాల జిల్లా,నందికొట్కూరు సి.పి.ఐ(ఎం.ఎల్)లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలోఎమ్మెల్యే జయసూర్యకి నందికొట్కూరు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన పి.జి.ఆర్.ఎస్ లో జిల్లా కార్యదర్శి పిక్కిలి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోఎమ్మెల్యే వినతిపత్రం ఇవ్వడం జరిగింది.అనంతరం పిక్కిలి.వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే గిత్త.జయసూర్యతో మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పాటై 20 మాసాలు కావస్తున్న నేటికిని ఒక కొత్త పెన్షన్ మంజూరు కాలేదని తక్షణమే కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా నందికొట్కూరు పట్టణంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని అలగనూరు నుండి మున్సిపాలిటీ పట్టణానికి త్రాగునీటి కోసం నిధులు మంజూరు చేశారని అయినా ఇంకా పనులు పూర్తి కాకపోవడంతో నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు తక్షణమే అలగనూరు రిజర్వాయర్ కట్ట నిర్మించి నందికొట్కూరు గ్రామానికి త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపాలిటీ పట్టణంలో కే.జీ రోడ్డులో మార్కెట్ యార్డ్ నుండి జమ్మి చెట్టు వరకు సీ.సీ వెడల్పు రోడ్డు వేసి,స్ట్రీట్ లైట్లు.ఏర్పాటు చేయాలని పట్టణములో ప్రధానమంత్రి ఎన్టీఆర్ గృహకల్ప కింద ఇల్లు మంజూరైన వారికి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని డ్రైనేజీ కాలువలు మంజూరు చేసి మెయిన్ రోడ్లలో మరమ్మతులు చేయాలని సూపర్ సిక్స్ ఆమీలో భాగంగా పట్టణంలోని పేదవాళ్ళందరికీ రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారికి మూడు సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేసి గృహ నిర్మాణానికి 5 లక్షల రూపాయలు రుణ మందిర్ చేయాలని తదితర డిమాండ్లతో ఎమ్మెల్యే గిత్త.జయసూర్యకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సి.పి.ఐ (ఎం.ఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు టి.నరసింహులు లింగాల.శ్రీనివాసులు వేల్పుల.ఏసన్న లింగాల.శివకుమార్ ఎం.నారాయణ మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఎస్.బి.బి.,బి.లక్ష్మీదేవి,ఎస్.ముత్తు జాబి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు విద్యపై ఆసక్తి పెంచాలి

సూపర్వైజర్ కె.వి. సుబ్బమ్మ





**పుల్లల చెరువు ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** పుల్లల చెరువు మండలం యంద్రపల్లి గ్రామంలోని అంగన్వాడీ మెయిన్ సెంటర్లో 8వ పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సమగ్ర విద్యాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో విద్యాపట్ల అవగాహన పెంపొందించడంలో కీలకంగా నిలిచింది.3 నుంచి 5 సంవత్సరాల మధ్య వయస్సు గల చిన్నారులు విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ కె.వి. సుబ్బమ్మ మాట్లాడుతూ చిన్నారులకు చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి పెంచడం అత్యంత అవసరమని అన్నారు.మానసిక, శారీరక అభివృద్ధికి ప్రాథమిక విద్య పునాది వంటిదని, బాల్యంలోనే మంచి అలవాట్లు అలవరచి, విద్యపై దృష్టి సారిస్తే భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించడం సులభమవుతుందని అన్నారు.గ్రామస్థుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు పాటలు, ఆటలు, నృత్యాలు, వినోదాత్మక ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. వారి ప్రతిభను చూసి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో 5 సంవత్సరాలు పూర్తయిన చిన్నారులను పాఠశాలలో చేర్పించే నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించి, తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు చేయించాలని ప్రోత్సహించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణ, విద్యాపట్ల బాధ్యతలపై అవగాహన కల్పించారు. చిన్నారుల భవిష్యత్తు బలంగా ఉండాలంటే ప్రారంభ దశ నుంచే సరైన దిశలో విద్య అందించాల్సిన అవసరం ఉందని వివరించారు.గ్రామంలోని తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని తమ పిల్లల విద్యపై ఆసక్తి కనబరిచారు. చిన్నారుల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని గ్రామ పెద్దలు సూచించారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఎం.ఎల్.హెచ్.పీ రాజు, సర్వేయర్ రమేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ మీరావలి, విఆర్ఓ ఘని, హోమియో డాక్టర్ యాకోబు, అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.కె. షాహీదా, డి. రాజేశ్వరి, డి. శంకరి బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శుభంకరిఅమ్మవారి ఒడి బియ్యం కార్యక్రమం






**అనంతపురం (ఎబి నెట్వర్క్ )ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** అనంతపురం సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో 54 వ శుక్రవారం జరగనున్న ఒడిబియ్యం కార్యక్రమం ఐదవ వారం బెంగళూరు రోడ్ లోని ముత్యాలమ్మ దేవాలయంలో ఘనంగా జరిగింది . పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా సహస్రనామ పారాయణం నిమ్మకాయ దీపాలతో పూజ ఖడ్గమాల మొదలగు పూజలు నిర్వహించారు. అనంతరంఅమావాస్య రోజున విశేషం గా ముత్యాలమ్మ కు ఒడి బియ్యం పెట్టినారు 54 వారాలకు ఆర్థిక సహాయాన్ని శ్రీమతి రుక్మిణి సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ మాతృమూర్తి ఆర్థిక సాయం అందిస్తున్నారులి ఆలయ నిర్వాకులు పార్వతమ్మ అమ్మ వారి కార్యక్రమాన్ని శాస్త్రోతంగా నిర్వహించినారనీ సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ తెలిపారులి. ఈ కార్యక్రమంలో సేవకర్త రుక్మిణి ,సాయి ట్రస్ట్ రాఘవేంద్ర,నరేష్ ,భువన ,డా నవజ్యోతి ,పల్లవి , పద్మ ,శ్రీదేవి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు


## నంద్యాల జిల్లాలో జరిగే సి.ఐ.టి.యూ 17 వ రాష్ట్ర మహాసభలకు బయలుదేరి నాయకులు...!!



**నందికొట్కూరు ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** నంద్యాల జిల్లాలో జరుగు సి.ఐ.టి.యు 17వ రాష్ట్ర మహాసభల కు నందికొట్కూరు నుండి సి.పి.ఎం పార్టీ ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున కదిలి వెళ్లారు.ఈ సందర్భంగా ఎం.నాగేశ్వరావు,టి.గోపాలకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర.మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 చట్టాలను పెట్టుబడు దారులకు అనుగుణంగా నాలుగు లేబర్ కోడ్లుమార్చారని వారు ఆరోపించారు,రోజు రోజుకు పెరుగుతున్న పెట్రోల్,డీజిల్,గ్యాస్,నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా కార్మిక వేతనాలు పెంచాలని,అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని,స్కీ వర్కర్లకు కనీస వేతనం రూ 26,000/-వేలు ఇవ్వాలని,ఔట్సోర్సింగ్,కాంట్రాక్టు,డైల్ వే జి కార్మికులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు.ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పి.ఫకీర్ సాహెబ్,బేస్తరాజు,కొంగర.వెంకటేశ్వర్లు,ఆటో వెంకటేశ్వర్లు,హమాలి పాండు,మార్కెట్ యార్డ్,సివిల్ సప్లై,ఆటో కార్మికులు తదితర రంగాల నుండి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డాక్టర్ చల్లా ఆధ్వర్యంలో ఆలమూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించిన శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం





**ఆలమూరు,ఏప్రియల్ 17(అఖండ భూమి న్యూస్):** ఆలమూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది ఎస్.కె షరీఫ్,ప్రధాన కార్యదర్శి చల్లా సతీష్, జాయింట్ సెక్రటరీ గానుగుల శేషారావు లను డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆలమూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించినది.ఈ సందర్భంగా డాక్టర్ చల్లా మాట్లాడుతు అత్యధిక మెజారిటీతో వీరు నెగ్గటం చాలా సంతోషకర విషయం అని,ప్రముఖ న్యాయవాది ఎస్.కె షరీఫ్,చల్లా సతీష్ లు గతంలో కూడా ఆలమూరు బార్ అసోసియేషన్ లో పనిచేయడం గొప్ప విషయం అని, న్యాయవాద వృత్తి అంటే క్రమశిక్షణతో కూడుకున్నదని, చిన్న స్థాయి నుండి ఎదిగి ఇంతటి ఘన విజయాన్ని సాధించడం గొప్ప విషయం అని డాక్టర్ చల్లా అన్నారు.ఆలమూరు శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆలమూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులకు దుశ్శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి నూతన వస్త్రాలను బహుకరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు రామానుజుల శేషగిరిరావు,అధ్యక్షులు చల్లా నానాజీ, సెక్రటరీ ఎలుగుబంట్ల సాయిబాబు, ట్రెజరర్ శిరిగినీడి పట్టాభి,చల్లా భూషణం,ఆంధ్రప్రదేశ్ ఐక్య కాపునాడు ఆలమూరు మండలం ప్రెసిడెంట్ గొర్రిపూడి పెదకాపు,ఎలుగుబంట్ల బూరయ్య, శ్రీపతి వీర్రాజు, తిరణం ఉమ,చల్లా వెంకటేశ్వరరావు, చల్లా ఉదయం, చల్లా పెరుమాళ్ళు, కొపునీడి శ్రీను,డిపి రావు,ఎలుగుబంట్ల శ్రీను,ఎలుగుబంట్ల సత్తిబాబు,చల్లా ప్రభ,చల్లా భాస్కరావు, గంధం శ్రీను మరియు అధికసంఖ్యలో కాపుసోదరులు పాల్గొన్నారు.

## 8 వ పోషణ పక్వాడ



**త్రిపురాంతకం ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** కాకతీయ ఈ పోషణ పక్వాడా లో భాగంగా శుక్రవారం డి.వి. ఎన్ కాలనీలో తల్లులందరినీ మరియు లబ్ధిదారులను గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ఐ సి డి ఎస్ సూపర్వైజర్ డి దేవి మాట్లాడుతూ 0 టు రెండు సంవత్సరాల అంగన్వాడీ విద్యార్థినీ విద్యార్థుల బృహత్ దశ గురించి వివరించారు రెండు సంవత్సరాలలోపు పిల్లల పెరుగుదల ఎక్కువగా ఉంటుందని కాబట్టి విద్యార్థిని విద్యార్థులకు సెల్ ఫోన్లు ఇవ్వరాదని ప్యాకేజీ ఆహారం వాడరాదని తల్లులందరికీ వివరించారు సెల్ ఫోన్ వాడటం వలన పిల్లలు శారీరకంగా మానసిక ఎదుగుదల గుంటు పడుతుందని ఆమె వివరించారు పిల్లలను ఒంటరిగా ఉంచకుండా పెద్దలతో కలిసి ఉంచాలని ఆమె ఆ సమావేశంలో వారికి వివరించారు ఈ కార్యక్రమానికి అంగన్వాడి కార్యకర్తలు పి నాగమణి ఎన్ విశ్రాంతకుమారి ఎం నిర్మల జ్యోతి ఏ సరస్వతి పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ ఎమ్మెల్యే గిత్త...!!



**నందికొట్కూరు ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణం మున్సిపల్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ నిర్వహించి నందికొట్కూరు పట్టణ ప్రజల వద్ద నుండి పిర్యాదులు,వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త.జయసూర్య ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టి.డి.పి నాయకులు,అధికారులు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్);** రామిరెడ్డి మండలంలోని పోషనిపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు విధానాన్ని సమీక్షించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రతి వరి సంచికి 40.600 కిలోల తూకం ఉండేలా ఖచ్చితంగా కొలవాలని ఆయన ఆదేశించారు. తూకం ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనంతరం సన్న దాన్యం నాణ్యతను మిషన్ ద్వారా పరీక్షించి, తేమ శాతాన్ని పరిశీలించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే కేంద్రంలో మౌలిక సదుపాయాలు, తాగునీరు, నిల్వ సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, బియ్యం డి ఎం శ్రీకాంత్, డిసిఓ రామ్మోహన్, ఎమ్మార్వో సుమలత, పంచాయతీ సెక్రెటరీ, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అఖండ భూమి

శనివారం 18- 04 - 2026

# పల్లె రమేష్ గౌడ్ పై ఆరోపణలు సరికాదు

**అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం సిగ్గు చేటు..**

**ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదు..**







**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** జిల్లా కేంద్రంలోని ఆర్. అండ్. బి. అతిథి గృహంలో కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం పరిధి పేట గ్రామ అంబేద్కర్ బహుజన నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన బిడ్డ అయిన పల్లె రమేష్ గౌడ్ పై కొంతమంది తమ స్వార్థం కోసం ఆరోపణలు చేస్తూ చేసిన ఫిర్యాదును వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే దళిత, బహుజనుల ఆగ్రహానికి గురికాక తప్పదని దళిత, బహుజన సంఘాల నాయకులు హెచ్చరించారు. పాల్వంచ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పల్లె రమేష్ గౌడ్ ప్రజా సేవకుడు అని, అతడు దళితులను అవమానించే వ్యక్తి కాదన్నారు. కులమతాలకు అతీతంగా అందరితో కలసి ఉండే వ్యక్తి అని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిపై కొంతమంది తప్పుడు ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. ఆయనపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే వారు గ్రామంలో మాట్లాడుకోవాలి తప్ప ఇలా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. తనతో రాజకీయ విభేదాలు ఉంటే గ్రామంలో చూసుకోవాలే తప్ప కొంత మందిని ఉసిగొలిపి ఇలా కేసులు పెట్టించడం తగదని ఫరీద్ పేట గ్రామ సర్పంచ్ నర్సింహా రెడ్డి కి సూచించారు. గ్రామంలో ప్రతీ యేటా జరిగే సీతారాముల కళ్యాణోత్సవంలో దళితులను ప్రత్యేకంగా పిలిచి బట్టలు పెట్టి పూజలో కూర్చుండబెట్టిన రమేష్ గౌడ్ పైన దళితులను కించపరిచేలా మాట్లాడాడని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. గ్రామంలో అభివృద్ధి ఎవరి ద్వారా చేశారో గ్రామంలో నిరూపించుకోవాలని గుర్తు చేశారు ఇప్పటికైనా రమేష్ గౌడ్ పై చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని లేనియెడల తమ ఇండ్లను ముట్టడిస్తామని డిమాండ్ చేశారు. అనంతరం ఏఎస్పి చైతన్య రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో దళిత, బహుజన సంఘాల నాయకులు దేవుళ్ళ రాములు, బైండ్ల రామస్వామి, విష్ణు, లక్ష్మీనర్సు, భూమవ్వ, కొంగల లక్ష్మి, రాజమణి, వరలక్ష్మి, తగిరంచ రాజిరెడ్డి, పెరుమాండ్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# గౌడ జనాభాను తగ్గించి చూపిస్తున్నారంటూ జై గౌడ ఉద్యమం ఆరోపణలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** అసమగ్ర సర్వే రిపోర్ట్‌పై మండిపడ్డ జై గౌడ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోళ్ళ మురళి గౌడ్ రాష్ట్రంలో గౌడ కుల జనాభాను కావాలనే తగ్గించి చూపిస్తూ రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం జరుగుతోందని జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోళ్ళ మురళి గౌడ్ ఆరోపించారు. ఇటీవల విడుదలైన సమగ్ర సర్వే నివేదికలో గౌడ కుటుంబాల సంఖ్యను వాస్తవానికి విరుద్ధంగా చూపించారని ఆయన విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు ఉన్న గౌడ సమాజాన్ని కేవలం తక్కువ సంఖ్యలో ఉన్నట్లు పేర్కొనడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో ఎక్కడ చూసినా గౌడల సంఖ్య గణనీయంగా కనిపిస్తుందని, అలాంటి పరిస్థితిలో వారిని మైనార్టీ వర్గంలా చూపించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. గౌడ సమాజం బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, బహుజన వర్గాల గొంతు మరింత బలంగా వినిపిస్తుందని పేర్కొన్నారు. అందుకే ఆ వర్గాన్ని బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చరిత్రను విస్మరించొద్దని వ్యాఖ్య గౌడ సమాజం చరిత్రాత్మకంగా పోరాట స్ఫూర్తి కలిగిన వర్గమని మురళి గౌడ్ అన్నారు. మహారాజ్ పాపన్న గౌడ్ కాలం నుంచే దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా గౌడలు పోరాడారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యోద్యమం, రజాకారుల వ్యతిరేక పోరాటం, తెలంగాణ ఉద్యమాలు, సామాజిక న్యాయ పోరాటాల్లో గౌడల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆలయాలు, విగ్రహాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ఉద్యమాలకు గౌడ సమాజం ఆర్థికంగా అండగా నిలిచిందని చెప్పారు. కష్టపడి సంపాదించిన సంపదను సమాజ హితానికి వినియోగించిన వర్గం గౌడలేనని పేర్కొన్నారు. ఆర్థిక మూలాలపై దాడి చేశారంటూ ఆరోపణ గౌడల సంప్రదాయ వృత్తి అయిన కల్లు, తాటి, ఈత చెట్ల ఆధారిత జీవన విధానాన్ని గత దశాబ్దాలుగా దెబ్బతీసే ప్రయత్నాలు జరిగాయని ఆయన ఆరోపించారు. వృత్తిని బలహీనపరిస్తే సమాజాన్ని బలహీనపరచవచ్చనే ఉద్దేశంతో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. ప్రమాదాలకు గురైన గౌడ కార్మికులకు సరైన పరిహారం ఇవ్వడం లేదని, యువతకు విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కూడా పరిమితమవుతున్నాయని అన్నారు. గ్రామాల వారీగా నివేదిక విడుదల చేయాలని డిమాండ్ జనాభా లెక్కలపై అనుమానాలు నివృత్తి చేయాలంటే గ్రామాల వారీగా, మండలాల వారీగా పూర్తి నివేదిక విడుదల చేయాలని మురళి గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి గణాంకాలు మాత్రమే వెల్లడించడం ద్వారా వాస్తవాలను దాచిపెడుతున్నారని ఆరోపించారు. ప్రతి గ్రామంలో ఏ కులం ఎంత జనాభా కలిగి ఉందో స్పష్టంగా ప్రకటిస్తే అసలు నిజాలు బయటపడతాయని అన్నారు. బహుజన వర్గాలు ఐక్యంగా ఉండాలన్న పిలుపు ఈరోజు గౌడ సమాజంపై జరిగిన అన్యాయం రేపు ఇతర బీసీ, బహుజన వర్గాలపై కూడా జరగవచ్చని ఆయన హెచ్చరించారు. యాదవ్, ముదిరాజ్, పద్మశాలి, మున్నూరు కాపు తదితర వర్గాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జనాభా ఆధారిత హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కోసం అన్ని బహుజన వర్గాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గౌడ సమాజాన్ని తక్కువ చేసి చూపించే ప్రతి ప్రయత్నాన్ని తిప్పికొడతామని, నిజమైన గణాంకాలు వెలుగులోకి వచ్చే వరకు ఉద్యమం కొనసాగిస్తామని మురళి గౌడ్ స్పష్టం చేశారు.



# ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

**తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్....**




**భువనగిరి ఏప్రిల్ 17. (అఖండభూమి న్యూస్):** దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాడు తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆర్డిఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి, వినతి పత్రాన్ని అందజేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఆర్డిఓ కు వినతిపత్రం అందించిన అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులకు సంబంధించిన దీర్ఘకాలికంగా అనేక సమస్యలు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు (కాంగ్రెస్ ప్రభుత్వం) చేపట్టాక కొన్ని సమస్యలు పరిష్కృతం అయ్యాయని చెప్పారు. అనేక సమస్యలు ఇప్పటికీ పెండింగ్లో ఉన్నాయని, న్యాయబద్ధమైన డిమాండ్ సైతం అమలుకు నోచుకోవడం లేదని ఆలోచించారు. ఈ విషయాన్ని వివిధ రూపాలలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లిన ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, న్యాయబద్ధమైన దినాలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించామని అన్నారు. జూన్ రెండు వరకు పిఆర్సి ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆరోగ్య భీమా కార్డులను తక్షణమే అమలు చేయాలని అన్నారు. సిపిఎస్ రద్దుచేసి, ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబర్ ఒకటికి ముందు నియమకమైన ఉద్యోగులకు ఓపిఎస్ అమలు చేయాలని అన్నారు. పెండింగ్ బిల్లులతోపాటు పెండింగ్ డిఎల్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61 యొక్క సంవత్సరాలు నిండిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సాధారణ బదిలీలను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యచరణ రూపొందించి ముందుకు సాగాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు తెలంగాణ ఉద్యోగుల ఐక్య కారణ కమిటీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పి రాధ, తాసిల్దార్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆర్ ఉమా, టిపియూఎస్ జిల్లా అధ్యక్షులు కె శ్రీధర్, రాష్ట్ర కన్వీనర్ పి ఇందుమతి, భువనగిరి పట్టణ అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు పి. రవి కుమార్, తాసిల్దార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, టి జి ఆర్ ఎస్ ఏ ముఖ్య నాయకులు లోకేందర్ రెడ్డి, సైదా సాహెబ్, కళ్యాణ్, ప్రణయ్, జిపిఓఎస్ రాష్ట్ర కోశాధికారి గుర్రాల బాలకృష్ణ, నాయకులు కే శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు బి కల్పన, టీపి యుఎస్ మండల కార్యదర్శి బి రాఘవరెడ్డి, నాయకులు సంతోష్, కోశాధికారి కిరణ్ కుమార్, టి జి ఆర్ ఎస్ ఏ ముఖ్య నాయకులు ఇస్తారి, మల్లేష్, శ్యామలత, ఝాన్సీ, సరస్వతి, పాండు, వివేకా, వెంకటేష్, అనిల్, నవీన్, భాను, రాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు....

# ఉపాధి హామీ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి

**సంవత్సరానికి 200 రోజుల ఉపాధి పని దినాలు కల్పించి, రోజుకు 800 రూపాయల వేతనం చెల్లించాలి....**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్....**





**బొమ్మలరామారం ఏప్రిల్ 17. (అఖండభూమి న్యూస్):** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రమాదం జరిగితే, ఎలాంటి ప్రమాద బీమా సౌకర్యం లేకపోవడంతో ఉపాధి హామీ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నరసింహ అన్నారు. శుక్రవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని మర్యాల గ్రామంలో ఉపాధి హామీ కార్మికుల పని ప్రదేశాన్ని ఆయన నాయకతో కలిసి సందర్శించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, సంవత్సరంలో 200 రోజుల ఉపాధి పని దినాలను కల్పిస్తూ, రోజు కూలి 800 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వందలాది మంది కార్మికులు ఎర్రటి ఎండలో పనిచేస్తూ, ఎండ వేడి తట్టుకోలేక, వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోతున్న కార్మికులకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఉన్నదని అన్నారు. వెంటనే ఉపాధి హామీ పథకంలో పనిచేస్తూ, ప్రమాదంలో మరణించిన కార్మికులకు 10 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, ఆధునీకరణ వలన కూలీలకు ప్రతి సీజన్లో 10 రోజుల నుండి 20 రోజుల వరకు ఉపాధి దొరకడం లేదని చెప్పారు. మిగతా సమయంలో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం దేశవ్యాప్తంగా వ్యవసాయ కూలీలను ఆదుకోవడానికి ఉపాధి హామీ పథకాన్ని 200 రోజుల పని దినాలను కల్పించే విధంగా సవరించాలని సూచించారు. రోజురోజుకు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన పెద్ద ఎత్తున నిత్యవసర వస్తువుల ధరలు పెరగడం, మరోవైపు విద్య, వైద్యం సామాన్య మానవులకు, పేదలకు అందనంత దూరంలో ఉండటం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే పెరుగుతున్న ధరలకు అనుకూలంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు 200 రూపాయల వేతనని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యల సాధన కోసం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాలలో పెద్ద ఎత్తున ఉపాధి హామీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైట్ సంఘం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు దేశెట్టి సత్యనారాయణ, కార్మికులు కురుమండ్ల లత, కుందనపల్లి నిర్మల, లింగారి భాగ్య, అన్నారం ఉమారాణి, బాలమణి, మన్నే అనురాధ, సంపత్ విజయ, మూల నిర్మల, ఐల కల్పన, షేక్ సోగ్రాభి, సానా బేగం, ప్యారారం నరసింహ, సునీత, అన్యమైన నరసింహ, ఎర్రోళ్ల పోచమ్మ, ఉప్పునూతల కవిత, సన్నగళ్ళ ఇందిర, సంగి అమరావతి, యాదగిరి, నల్లగొండ లావణ్య, తదితరులు పాల్గొన్నారు....



# భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులు

**ఆలేరు ఏప్రిల్ 17. (అఖండభూమి న్యూస్):** తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ పిలుపుమేరకు శుక్రవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల, పట్టణ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర నాయకులు పసుపులేటి నరేంద్ర స్వామి, జిట్టబోయిన సైదులు, దూడల వెంకటేష్, బుషపాక రాములు, జిల్లా నాయకులు బొమ్మకంటి బాలరాజు, పూల నాగయ్య, మండల నాయకులు దశమంతు రెడ్డి, సయ్యద్, శంకర్, రాజేశ్వరరావు లుక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, డియర్ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. పెన్షన్ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లను తక్షణమే చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి, ఖాజా, అలుగుబెల్లి హేమలత, రిష్మ, ఉద్యోగ, ఉపాధ్యాయులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డా. సుధాకర్ గౌడ్ పాలకమండలి సభ్యులుగా ఎన్నికైనందుకు ఘన సన్మానం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి; ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్);** తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డా. సుధాకర్ గౌడ్ తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు గా ఎన్నికైనందుకు సౌత్ క్యాంపస్ అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. రెగ్యులర్ అధ్యాపకులు, కాంట్రాక్ట్ అధ్యాపకులు మరియు పార్ట్ టైమ్ అధ్యాపకులు సన్మానించారు. ఈ సందర్భంగా డా. మోహన్ బాబు, డా. నారాయణ, డా. ఇంద్రకరణ్ లు మాట్లాడుతూ డా. సుధాకర్ గౌడ్ సేవలకు ఒక గుర్తింపు ఈ పాలక మండలి లో స్థానం అని అన్నారు. సౌత్ క్యాంపస్ అభివృద్ధికి చర్చ చెయ్యడం కోసం ఇది ఉపయోగం అని అన్నారు. సౌత్ క్యాంపస్ అభివృద్ధికి పాలకమండలి దృష్టి పెట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. లలిత, డా. హరిత, డా. అంజయ్య, డా. సబిత , డా. నాగరాజు, డా. సునీత, డా. రమాదేవి, డా. నిరంజన్ శర్మ, శ్రీకాంత్, డా. సరిత పిట్ల, దిలీప్, డా. శ్రీమాత, డా. కనకయ్య, డా. వెంకట్ రెడ్డి, డా. అఫ్రీన్, శ్రీకాంత్ గౌడ్, విజయ్ కుమార్, సునీల్, శ్రీకాంత్ , డా.మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి పట్టణం 6వ వార్డులో నిత్యం విద్యుత్ కోత

**విద్యుత్ బకాయిలను ముక్కు పిండి వసులు చేస్తున్న వైనం!**

**వార్డ్ కౌన్సిలర్ ఎన్నిమార్లు విన్నవించిన పట్టించుకోనీ అధికారులు!**



**బెల్లంపల్లి ఏప్రిల్ 17(అఖండ భూమి న్యూస్):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని 6వ వార్డులో నిత్యం మంచినీటి సమస్య,విద్యుత్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతున్నది. ఉష్ణోగ్రత 40 నుండి 45/శాతం వరకు ఉండడం ద్వారా వృద్ధులు,విద్యార్థిని విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మంచినీటి బిల్లు,బిల్లులు వసూలు చేసిన రీతిలో మంచినీరు,విద్యుత్ సరఫరా చేసే బాధ్యత కూడా మున్సిపల్ అధికారులకు మాత్రమే ఉంటుందిలన్నారు.కానీ వారి బాధ్యతను విస్మరించి నిత్యం కరెంటు కోత విధించడం ద్వారా కాలని వాసులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా మంచి నీటి,అలాగే విద్యుత్ సరఫరా చేసే సంబంధిత అధికారులు తక్షణమే చొరవ తీసుకొని మంచినీరుకు, విద్యుత్ కు అంతరాయం కలుగకుండా చూడాలి,ఎందుకంటే మంచి నీరు బిల్లు, విద్యుత్ బకాయిలు వసూల్ చేసే ధ్యాస ప్రజలకు అందించేల ఉండాలి. లేనిపక్షంలో 6వ వార్డులో ఉన్నటువంటి బస్తివాసులను కలుపుకొని సంబంధిత అధికారుల కార్యాలయం ముందు ధర్నా చేస్తామని సూచిస్తున్నామన్నారు. ఈ ఆందోళన కార్యక్రమానికి సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కమిటీ (ఓపిడిఆర్) అంబాలా మహేందర్ తెలియజేసారు.

# ముఖ్యమంత్రిని కలిసిన బండ్రు....



**ఆలేరు ఏప్రిల్ 17. (అఖండభూమి న్యూస్):** రాజ్యసభ సభ్యులుగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గురువారం రాత్రి న్యూఢిల్లీలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు...

# మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్య




**ఆలేరు ఏప్రిల్ 17. (అఖండభూమి న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని నూనెగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆలేటి మల్లారెడ్డి మాతృమూర్తి ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్య గౌడ్ శుక్రవారం నాడు మృతురాలి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముందటి రామకృష్ణారెడ్డి, ఎండి ఖలీల్, అంజిరెడ్డి, మదారబోయిన శ్రీను, గిలకత్తుల శ్రీను, రాజు, గ్రామ పుర ప్రముఖులు రమేష్, మాధవరెడ్డి, సతీష్, ఐలయ్య, ఎల్లయ్య, లక్ష్మారెడ్డి, యాదయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు....

# మా.. గ్రామానికి రోడ్డు నిర్మించండి మహాప్రభో..!

**నాయకులకు గంపరాయి గ్రామస్తులు వినతి.**





**కొయ్యూరు, అల్లూరి జిల్లా ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** దశాబ్దాలుగా కనీస రోడ్డు సౌకర్యం లేక నరకయాతన పడుతున్న గంపరాయి గ్రామాన్ని ఏ ఒక్క ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని అనేక దఫాలుగా నాయకులకు, అధికార్లు కు స్వయంగా విజ్ఞప్తి చేసిన నేటికీ తమ గ్రామానికి రోడ్డు కల్పించలేని దుస్థితి నెలకొన్నట్టు ఆ గ్రామస్తులు మోర పడుతున్నారు. ఈ మేరకు శుక్రవారం శిథిలావస్థలో ఉన్న ఇక్కడ రోడ్డుపై బైఠాయించి ఆ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొయ్యూరు మండలం అంతాడ పంచాయితీ శివారు గ్రామమైన గంపరాయి కి గత 2018 లో 4లక్షల రూ. లతో కొక్కితపాడు గ్రామం నుండి గంపరాయి వరకు గ్రామస్తులంతా సొంత నిధులతో ఈ రోడ్డు వేసుకున్నట్టు తెలిపారు. ఈ రోడ్డు కోసం ఐటిడిఏ ఆఫీస్ కి అనేక దఫాలుగా వినతి పత్రాలను అందజేశామన్నారు. ఈ రోడ్డు కు సంబధిత అధికార్లు కొలతలు వేసి నెంబర్లు వేయటం చేసినా ఏ అధికారి తిరిగి ఈ శిధిలమైన రోడ్డు ను నేటికీ పట్టించుకోలేదని వారంతా వాపోతున్నారు. దశాబ్దాలగా తాము పడుతున్న బాధలను ఇప్పటికైనా స్పందించి స్థానిక నాయకులు, జిల్లా కలెక్టర్ మరియు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిణి, మండల అధికార్లు ఈ గంపరాయి - రోడ్డు నిర్మించి ఆదుకోవాలని ఆ గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# యర్రవరం గ్రామంలో స్వచ్ఛ రథం ప్రారంభించిన బస్వా మహాలక్ష్మి ప్రసాద్

**పొడి చెత్తకు నిత్యావసర సరుకులు -ఎంపీడీవో రామరాజు వర్మ**



**ఏలేశ్వరం,(అఖండభూమి న్యూస్ ఏప్రిల్ 17 ):** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో స్వచ్ఛ భారత్ లక్ష్యంగా స్వచ్ఛ రథాన్ని ఎంపీడీవో రామరాజు వర్మ,టీడీపీ నాయకుడు బస్వా ప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలో పలువురు ప్రజలు స్వచ్ఛ రథం వద్ద డ్రై వెస్ట్ అందించి నిత్యావసర సరుకులు పొందారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామరాజు వర్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని తెలిపారు. డ్రై వెస్ట్ (పొడి చెత్త) సేకరణను ప్రోత్సహించే భాగంగా కూటమి ప్రభుత్వం స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేసిందన్నారు. మండల వ్యాప్తంగా రోజుకు ఒక గ్రామం చొప్పున ఈ రథం చెత్త సేకరణ చేపడుతుందని వివరించారు. గ్రామాల్లో ప్రజలు తమ వద్ద ఉన్న ఐరన్, ప్లాస్టిక్, అట్ట వంటి పొడి చెత్తను స్వచ్ఛ రథం వద్దకు తీసుకువచ్చి విక్రయించవచ్చని చెప్పారు. ఐరన్, ప్లాస్టిక్‌కు కేజీకి రూ.20, అట్ట కాగితాలకు కేజీకి రూ.15 చొప్పున నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని గ్రామాల పరిశుభ్రతకు తోడ్పడాలని సూచించారు.

అఖండ భూమి

శనివారం 18- 04 - 2026

# వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వాసంశెట్టికి మార్గాని భరత్ రామ్ అభినందనలు

-వైసిపి బలోపేతానికి కష్టపడి పనిచేస్తానని వెల్లడి







**రాజమహేంద్రవరం ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సీనియర్ కార్మిక నాయకుడు వాసంశెట్టి గంగాధర రావుకి స్థానిక మార్గాని ఎస్టేట్స్‌లోని వైఎస్ఆర్ సిపి కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ నియామక ఉత్తర్వులు అందచేసారు. ఈ సందర్భంగా మార్గాని భరత్ వాసంశెట్టికి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వాసంశెట్టి గంగాధరరావు తన తండ్రి మార్గాని నాగేశ్వరరావుకి సమకాలీకులుగా ఉన్నారన్నారు. ఆయన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని వైసిపిలో రాష్ట్ర కార్యదర్శిగా నియమించాలని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి సిఫారసు చేస్తే ఆయన వెంటనే ఉత్తర్వులు విడుదల చేసారన్నారు. రాజమండ్రి పార్లమెంట్ పరిధిలో వాసంశెట్టి గంగాధరరావు సేవలను వినియోగించుకుని వైసిపిని మరింత బలోపేతం చేసేందుకు పనిచేస్తామన్నారు. వాసంశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ 1984 నుంచి కార్మిక నేపథ్యంలో రాజకీయాల్లో పనిచేస్తున్నానని తెలిపారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ ప్రతీ విషయంలోనూ మంచి ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించారని కృతజ్ఞతలు తెలిపారు. ఇంత మంచి పదవి ఇంత వరకు తనకు రాలేదని భరత్ పట్టుబట్టి రాష్ట్ర కార్యదర్శిగా నియమించారని పేర్కొన్నారు. ఇంత ముఖ్య బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు రుణపడి ఉంటానని, పార్టీ బలోపేతానికి తనకు ఉన్న అనుభవాన్ని, కార్యదక్షతను ఉపయోగించి పనిచేస్తానని తెలిపారు. ఇకపై పూర్తిస్థాయిలో పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటానని, భరత్ రామ్ ఆదేశాల మేరకు వైసిపి కార్యకర్తకు ఎక్కడ ఏ కష్టం వచ్చినా అండగా నిలబడతానని భరోసా ఇచ్చారు. తనపై నమ్మకం ఉంచిన జగన్‌కు, భరత్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇదే సందర్భంగా కేక్ కట్ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దాసి వెంకట్రావు, మార్తి లక్ష్మి, పోలు విజయలక్ష్మి, సంకిస భవానీప్రియ, బిల్డర్ చిన్న, రొక్కం త్రినాధ్, ఆరే చిన్ని, తిరగటి దుర్గ, మార్తి నాగేశ్వరరావు, సప్పా ఆదినారాయణ, శంకర్, కె.అనూరాధ, తో పాటు రాజమండ్రి ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ప్రత్యేక అలంకరణలో చొప్పెల్ల శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు



**ఆలమూరు,ఏప్రియల్ 17(అఖండ భూమి న్యూస్):**అమావాస్య శుక్రవారం పర్వదినం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో చొప్పెల్ల శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకున్నారు.ప్రతి శుక్రవారం జరిగే అమ్మవారికి పంచామృత అభిషేకం,కుంకుమార్చన పూజలు ఎంతో ఘనంగా జరిగాయి.

# సిపిఎం ఆందోళనకు దిగడంతో కదిలిన అధికారులు చివరకు మంచినీటి సమస్య పరిష్కారం


**తుగ్గలి ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** మండలంలోని జొన్నగిరి దళితవాడలో నెలలుగా కొనసాగుతున్న మంచినీటి సమస్యపై చివరకు అధికారులు స్పందించారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన ఫలితంగా సమస్యకు తాత్కాలిక పరిష్కారం లభించింది. గత కొంతకాలంగా జొన్నగిరి ఎస్సీ కాలనీలో తీవ్రమైన తాగునీటి కొరత నెలకొంది. సమస్యను పలుమార్లు ఆర్డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. దీంతో చివరకు సిపిఎం నాయకులను ఆశ్రయించిన దళితులు, సమస్యను బయటకు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సిపిఎం మండల కార్యదర్శి శ్రీ రాములు ఆధ్వర్యంలో గ్రామస్థులు సచివాలయం ఎదుట బిందెలతో ముట్టడి చేసి ఆందోళన చేపట్టారు. "మూడు నెలలుగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం... గుక్కెడు మంచినీళ్లు కూడా అందించలేని పరిస్థితి ఎందుకు?" అంటూ మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల నిరసనతో అప్రమత్తమైన అధికారులు, పరిస్థితిని సమీక్షించి వెంటనే చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి స్పందించి దళితవాడలోని బోర్‌వెల్‌కు మరమ్మతులు చేయించి అదే రోజు సాయంత్రం నుండి నీటి సరఫరా ప్రారంభించారు. అయితే, "ఆందోళన చేసిన తర్వాతే అధికారులు కదలిక చూపడం బాధాకరం'' అని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. మండలంలో ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యలపై సమగ్ర ప్రణాళికతో ముందుకు రావాలని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ధర్నాకు పిలుపు



**జి.మాడుగుల ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏప్రిల్ 21, 2026న ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఒక రోజు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని కొక్కిరపల్లి ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దాప్పొడి రాంబాబు, డిప్యూటీ హెచ్ఎం డేవిడ్ సమక్షంలో ఉపాధ్యాయులతో కలిసి కరపత్రాన్ని విడుదల చేశారు. ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు యు.వి. గిరి, అల్లూరి ఏపీయూఎస్ జిల్లా అధ్యక్షులు కొండపల్లి రాంబాబు, పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కుడుముల కాంతారావు, నాయకులు కృష్ణమూర్తి, నాగరాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెగా జాబ్ మేళా 107 మందికి ఉద్యోగాలు అపాయింట్మెంట్ లెటర్లు అందజేసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**ఏలూరు జిల్లా పోలవరం ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** నియోజకవర్గం జీలుగుమిల్లి మండలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు తెలియజేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బర్రింకలపాడు లోని బర్రింకలపాడు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జాబ్ మేళాను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ జాబ్ మేళాలో 250 మంది అభ్యర్థులు పాల్గొనగా వివిధ ప్రైవేట్ సంస్థలు నిర్వహించిన నిర్వహించిన ఇంటర్వ్యూలో 107 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేతుల మీదుగా అపాయింట్మెంట్ లెటర్లు అందజేశారు ఈ సందర్భంగా ఎంపికైన యువత ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు నైపుణ్య అభివృద్ధి కల్పించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని చెప్పారు గ్రామీణ ప్రాంత యువతకు సమాన అవకాశాలు అందించాలని ఉద్దేశంతో ఎలాంటి జాబ్ మేళాను నిరంతరం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి ఎంపీడీవో వెంకటలక్ష్మి ఎమ్మార్వో వెంకటేశ్వరరావు డిటి పెద్దరాజు ఏపీ డి జనసేన పార్టీ మండల అధ్యక్షులు పసుపులేటి రాము, బుచ్చిరాజు జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దుగ్గిన శ్రీనివాస్ పదం వెంకటకృష్ణతోపాటు వివిధ శాఖల అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చారిత్రాత్మకం మహిళా రిజర్వేషన్ బిల్లు

-దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజు

-జగనన్న ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసింది

-మహిళాభ్యున్నతికి వైసిపి హయాంలో అనేక పథకాల అమలు

-కానీ చంద్రబాబు పాలనలో మహిళా పథకాలకు తూట్లు

-దివాన్ చెరువు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి మా ఘనతే

-మిగిలిన ఫ్లైఓవర్‌లను కూటమి ప్రభుత్వం అటకెక్కించింది

-రెండేళ్ళు గడుస్తున్నా మోరంపూడి ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు ఏది?

-రైల్వే స్టేషన్ అభివద్ధి పట్ల నిర్లక్ష్య ధోరణి

-మద్యం, ఇసుక, కబ్జాలతో దోచుకుంటున్న ఇవిఎం ఎమ్మెల్యే

-మీడియా సమావేశంలో మాజీ ఎంపి, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్





**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** మహిళలకు చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పిస్తు కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడం దేశంలో చారిత్రాత్మకమని, సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజని రాజమహేంద్రవరం పార్లమెంట్ మాజీ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక మార్గాని ఎస్టేట్‌లోని సిటీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో భరత్ రామ్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ ముందుకు 2023లోనే వచ్చిందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టం కానున్న దశలో మహిళా అక్కా, చెల్లెమ్మలు అందరికి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ బిల్లు తీసుకురావడాన్ని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి గతంలోనే స్వాగతించారని తెలిపారు. జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని, మహిళల అభ్యున్నతి కొరకు జగన్ పాలనలో అనేక పథకాలను అమలు చేసి వేలాధి కోట్ల రూపాయలను మహిళల ఖాతాల్లో వేశారని తెలిపారు. 33 లక్షల మంది మహిళలకు ఇళ్ళ స్థలాలు అందించడమే కాకుండా ఇళ్ళు కట్టించే ప్రయత్నం చేశారన్నారు. వైఎస్సార్ చేయూత ద్వారా 45ఏళ్ళు దాటిన మహిళలకు ప్రతి యేటా రూ.18750లు మహిళల ఖాతాల్లో వేశారన్నారు. ఈ పథకం ద్వారా 50లక్షల మంది మహిళలు లబ్ధిపొందారన్నారు. డ్వాక్రా రుణాల మాఫీ, సున్నా వడ్డి రుణాలు, అమ్మఒడి వంటి పథకాల ద్వారా వేలాది కోట్ల రూపాయలను మహిళల బ్యాంక్ ఖాతాలకు జమచేశారని గుర్తు చేశారు. మహిళలకు వివిధ పదవుల్లో 50శాతం అవకాశాలు కల్పించారని, నామినేటెడ్ పదవుల్లోను పెద్దఎత్తున అవకాశాలు కల్పించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడువి మాటలు తప్ప చేతలు ఉండవన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వచ్చి రెండేళ్ళు గడుస్తున్న మహిళలకు చేసింది ఏమీ లేదన్నారు. తల్లికి వందనం పేరు చెప్పి బిసి,ఎస్సీ, ఎస్టీలకు కోతపెట్టి వారి ఖాతాల్లో రూ.7వేలు, రూ.9వేలు మాత్రమే వేశారని ఆరోపించారు. ఈ పథకాన్ని ఒక ఏడాది పూర్తిగా ఎత్తేశారన్నారు. టిడ్కో ఇళ్ళను రెండేళ్ళలో పూర్తి చేయలేదన్నారు. తమ హయాంలో ప్రారంభించిన జగనన్న కాలనీలలో ఇళ్ళను పూర్తిచేయకుండా గాలి కొదిలేశారన్నారు. తమ ప్రభుత్వంలో వేలాది మంది మహిళలకు పట్టాలను అందజేశామని, ప్రభుత్వం మారినంత మాత్రాన ఎందుకు ఆ పట్టాలను లబ్ధిదారులకు అందించడం లేదని, స్థలాలను ఎందుకు అప్పగించరని ప్రశ్నించారు. వందల కోట్ల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన స్థలాలను ప్రభుత్వాలు మారినంత మాత్రన పట్టాలు ఇవ్వకుండా పక్కన పెట్టేస్తారా అని ప్రశ్నించారు. 4, 5లక్షల రూపాయలు విలువ చేసే స్థలాలని తమ హయాంలో అందించామన్నారు. మా ప్రభుత్వం వస్తే 3 సెంట్లు స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని రెండేళ్ళు గడిచినా ఆ ఊసే లేదన్నారు. టిడ్కో ఇళ్ళ కోసం వేలాది మంది కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. ప్రభుత్వం పేర్లు, రంగులు మార్చుకున్నా పర్వాలేదని, లబ్ధిదారుల ఇళ్ళ స్థలాలు, ఇళ్ళు కట్టించి ఇవ్వాలన్నారు. జగనన్న కాలనీలలో సౌకర్యాలు కల్పించాలన్నారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివ అభివృద్ధికి, భారత్ అమృత పథకంలో మంజూరు చేయించామని రెండేళ్ళు గడిచినా దీని అభివద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. రైల్వే స్టేషన్ అభివద్ధికి రూ.270 కోట్లతో డిజైన్‌లు కూడా వేయించామని, ప్రధాని మోదీ వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. బొమ్మూరు, దివాన్ చెరువుతో సహా నాలుగు ఫ్లైఓవర్ బ్రిడ్జిలతో పాటు ఔటర్ రింగ్ రోడ్డును కూడా మంజూరు చేయించామని వాటిని ఈ ప్రభుత్వం వచ్చి రెండేళ్ళు గడిచినా పట్టించుకోవడం లేదన్నారు. బొమ్మూరు ఫ్లైఓవర్ బ్రిడ్జిని రద్దు చేసేశారన్నారు. ఇప్పుడు నిర్మిస్తున్న దివాన్ చెరువు ఫ్లైఓవర్ నిర్మాణం మా ఘనతే అన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఇవిఎం ఎమ్మెల్యే పెద్దపెద్ద ఫ్లెక్సీలు పెట్టుకోవడం తప్ప, సర్వీసు రోడ్డు వేయించలేకపోయారన్నారు. ఇసుక, మద్యం, కబ్జాలతో ఇవిఎం ఎమ్మెల్యే, దోచుకోవడం తప్ప అభివృద్ధిపట్ల ఆయనకు దృష్టి లేదన్నారు. కోటిలింగాల ఘాట్ వద్ద నుండి హితకారిణి చైర్మన్‌ను పెట్టి ఇసుకను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక రవాణా వల్ల ఇబ్బందులు పడుతున్నామని, మల్లయ్య పేట, ప్రజలు పెద్దఎత్తున కలెక్టర్ వద్దకు వెళ్ళి ఫిర్యాదు చేశారన్నారు. నది గర్భంలో యదేచ్ఛగా డ్రెడ్జింగ్ చేస్తున్నారని అన్నారు. రెండేళ్ళుగా సర్వీస్ రోడ్డులు వేయని ఇవిఎం ఎమ్మెల్యే ఫ్లెక్సీలపై పేడ కొట్టాలని మండిపడ్డారు. రూరల్ ఎమ్మెల్యే, సిటీ ఎమ్మెల్యే, ఎంపిలు బాధ్యత తీసుకుని సర్వీస్‌రోడ్డులు వేయాలన్నారు. రివర్ ఫ్రంట్‌కు రూ.88 కోట్లు, ఎయిర్‌పోర్టుకు రూ.340 కోట్లు నిధులు తీసుకువచ్చిది కూడా తానేనన్నారు.

**యువతకు ఉపాధి కోసం 18న జాబ్‌మేళా**

**నిరుద్యోగ రహిత రాజమండ్రి నా లక్ష్యం**

**మార్గాని భరత్ జాబ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నాం**

యువతకు ఉపాది కల్పించే లక్ష్యంతో ఈనెల 18వ తేదీ శనివారం స్థానిక మార్గాని ఎస్టేట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తునట్లు మాజీ ఎంపి భరత్ రామ్ తెలిపారు. గత జనవరిలో మంజీర హోటల్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించి వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. నిరుద్యగ రహిత రాజమండ్రి నా లక్ష్యమని ఆ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. మార్గాని భరత్ జాబ్ సెంటర్‌ను ప్రారంభించి ప్రతి ఏటా జాబ్‌మేళాలు నిర్వహించడం ద్వారా కనీసం 2,3వేల మంది నిరుద్యోగులకు ఏటా ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రయత్నిస్తామన్నారు. ఎంఎన్‌సి కంపెనీలతో తనకు ఉన్న పరిచయాన్ని ఉపయోగించుకుని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశం కల్పించడానికి కషి చేస్తామన్నారు. శనివారం నిర్వహించే జాబ్ మేళాకు బ్యాంకింగ్, ఐటి, ఉత్పత్తి రంగాలకు చెందిన కంపెనీలు హాజరవుతాయన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని నిరుద్యోగులు హాజరయ్యి, జాబ్‌మేళాను సద్వియోగం చేసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) వాసంశెట్టి గంగాధరరావు, నాయకులు దాసి వెంకట్రావు, పోలు విజయలక్ష్మి, సంకిస భవానీ ప్రియ, మార్తి లక్ష్మి, మార్తి నాగేశ్వరరావు, తిరగటి దుర్గా, గారా చంటిబాబు, సప్పా వెంకటరమణ, బిల్డర్ చిన్న, రొక్క త్రినాధ్, నల్లా రామాంజనేయులు, ఆరే చిన్ని, రేగుళ్ళ బాలి శ్రీధర్, వట్టికూటి కష్ణవేణి, కే అనురాధ, గౌరీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడులో పోషణ పక్వాడలో పాల్గొన్న పిడి సిహెచ్ లక్ష్మి,కెవిఐబి వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు

## చిన్నారుల మెదడు అభివృద్ధికి తల్లిదండ్రులు దోహదపడాలి

## సిడీపీవో పద్మావతి



**ప్రత్తిపాడు,(అఖండభూమి న్యూస్ ఏప్రిల్ 17 ):** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గ్రామంలో ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సిడిపివో పద్మావతి ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మి,ఖాదీ చిన్న తరహా పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,ప్రముఖ న్యాయవాది బుగతాశివ హాజరయ్యారు.ఐసిడిఎస్ ప్రత్తిపాడు సెక్టార్ అంగన్వాడి కేంద్రం వద్ద నిర్వహించిన ఈ పోషణ పక్వాడ కార్యక్రమంలో గర్భిణీ బాలింతలు ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.సూపర్ డేలో చిన్నారి తండ్రులను భాగస్వామ్యం,ప్యాకెట్ మరియుసంప్రదాయ చిరుతిల్లు మధ్య తేడా,ఆట బొమ్మల సేకరణ ద్వారా చిన్నారులను ఉత్తేజంపజేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అనంతరం బాలింతలకు పోషక పదార్థాలను అందించారు.పిల్లల పెంపకాలలో తండ్రులు కూడా బాధ్యత వహించాలని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ప్రక్రియ అంగన్వాడి కేంద్రాల ద్వారానే ప్రారంభమవుతుందని తెలిపారు. చిన్నారులకు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చేసరికి మెదడు 80శాతం అభివృద్ధి చెందుతుందని ఆరు సంవత్సరాల వయసు వచ్చేసరికి మెదడు పూర్తిగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు అలవాట్లు స్క్రీన్,టీవీ మొబైల్ ఫోన్లకు మరియు ఐస్ క్రీం,చక్కెర వంటి పదార్థాలకు వంటి వాటికి దూరంగా ఉంచాలని కోరారు.చిన్నారులు తాత అమ్మమ్మ నాయనమ్మలు చెప్పే మంచి మంచి కథల ద్వారా వాళ్లకు మెదడు అభివృద్ధి ప్రక్రియలో దోహదపడాలని సూచించారు.తమ తమ పిల్లలకు ఇంటి లోపల మరియు బయట ప్రదేశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.దీని ద్వారా శారీరక నైపుణ్యాలు మెరుగుపడతాయని సామాజిక భావోద్వేగా వికాసం పెరుగుతుందన్నారు.మంచి పోషకాలు అందించాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మెదడు అభివృద్ధికి సహాయపడుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.చిన్నారుల పెంపకాలలో తండ్రులు కూడా బాధ్యతలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు,ఏపీఎం జి శ్రీనివాసరావు,ప్రత్తిపాడ జగ్గంపేట సిడిపివోలు టిడిఆర్ పద్మావతి,యం పూర్ణిమ,కూటమి నాయకులు మూరా చంటిబాబు, గోపి, సూపర్వైజర్లు వరలక్ష్మి,సూర్యకుమారి,చక్రవేణి, మంగా రత్నం,సునీత,సిడిఎస్ టీచర్లు, హెల్పర్లు, పలువురు గర్భిణీలుబాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# తూతూ మంత్రంగా బాల్యవివాహాల అవగాహన సదస్సులు అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆవేదన

ప్రజలే లేకుండా కార్యక్రమాలు... ఫోటోలకే పరిమితమైన అవగాహన -- ఉపయోగం ఏమిటని ప్రశ్నలు



**తుగ్గలి ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** తుగ్గలి మండల కేంద్రంలో బాల్యవివాహాల నివారణపై నిర్వహించాల్సిన అవగాహన సదస్సులు తూతూ మంత్రంగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా ప్రతినిధులకు గానీ, సంబంధిత అధికారులకు గానీ సరైన సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. మండల కేంద్రంలోని వైయస్సార్ విగ్రహం సమీపంలో జనసంచారం లేని ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని ఐసిడిఎస్ సూపర్వైజర్లు నిర్వహించిన ఈ సదస్సు ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తించింది. మిట్ట మధ్యాహ్నం సమయంలో కొద్దిమంది పిల్లలతో మాత్రమే కార్యక్రమం నిర్వహించడం గమనార్హం. అసలు అవగాహన కల్పించాల్సిన మహిళలు, వృద్ధులు, గ్రామ పెద్దలు పాల్గొనే అవకాశం లేకుండానే ఈ కార్యక్రమం ముగిసిపోయింది. "ఇలాంటి సదస్సులు ప్రజలకు ఉపయోగపడాలంటే రద్దీగా ఉండే ప్రదేశాల్లో నిర్వహించాలి. కానీ ఇక్కడ మాత్రం ఫోటోల కోసం మాత్రమే కార్యక్రమాలు చేస్తున్నట్టుంది" అంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరికి మాత్రమే తెలియజేసి, మిగతా ప్రజలను పక్కన పెట్టడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. బాల్యవివాహాల వంటి కీలక సమస్యపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉన్న అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని ప్రజలు అంటున్నారు. "ఇది అవగాహన కార్యక్రమమా... లేక కేవలం పేపర్ మీద చూపించడానికి చేస్తున్న నాటకమా?" అని గ్రామంలో చర్చలు సాగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఇలాంటి కార్యక్రమాలు నిజంగా ప్రజలకు ఉపయోగపడేలా పర్యవేక్షణ పెంచాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అలాగే భవిష్యత్తులో గ్రామాల్లో మహిళలు, యువత, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

నాలుగు మండలాల టార్గెట్ ఒత్తిడి" -- ఐసిడిఎస్ సూపర్వైజర్ సంచలన వివరణ ! స్థలం తెలియక ఎక్కడో నిర్వహించిన సదస్సు... పై అధికారుల పనితీరుపై ప్రశ్నలు తుగ్గలి మండల కేంద్రంలో తూతూ మంత్రంగా నిర్వహించిన బాల్యవివాహాల అవగాహన సదస్సుపై వివరణ కోరగా.. ఐసిడిఎస్ సూపర్వైజర్ చెప్పిన సమాధానం మరింత వివాదానికి దారి తీసింది. "ఈరోజు మాకు నాలుగు మండలాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని పై అధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి ఉంది. అందుకే ఎక్కడ నిర్వహించాలో సరైన అవగాహన లేకపోయినా ఎక్కడో ఒకచోట ఏర్పాటు చేసి కార్యక్రమం పూర్తి చేశాం" అని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం అధికార వ్యవస్థ పనితీరుపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్వహించాల్సిన అవగాహన సదస్సులు కేవలం టార్గెట్లు పూర్తి చేసేందుకు మాత్రమే జరుగుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "అవగాహన కార్యక్రమానికి స్థలం ఎక్కడో కూడా తెలియకుండా నిర్వహించడం ఎంతవరకు సమంజసం? ప్రజలకు ఉపయోగం లేకుండా ఇలా కార్యక్రమాలు చేస్తే ప్రయోజనం ఏమిటి?" అని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, సూపర్వైజర్ మరోసారి ఇలాంటి పొరపాటు జరగకుండా, ప్రజలు అందుబాటులో ఉండే ప్రదేశాల్లోనే కార్యక్రమాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఈ వివరణతోనే బాధ్యత తప్పించుకోవడం సరైనదేనా అనే ప్రశ్నలు మరింత ఉత్కంఠ రేపుతున్నాయి. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి, కేవలం టార్గెట్లు కాకుండా కార్యక్రమాల నాణ్యతపై దృష్టి పెట్టాలని, ప్రజలకు నిజమైన అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పౌష్టికాహారం ఆరోగ్యానికి సహకారం.ఎ పద్మజ




**యర్రగొండపాలెం,ఆర్ సి ఇంచార్జ్ ) ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడియస్ బోయలపల్లి సెక్టార్ సూపర్ వైజర్ ఏ పద్మజ అన్నారు.శుక్రవారం నాడు యర్రగొండపాలెం మండలంలోని కొత్త గొల్లలవిడిపి అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్బంగా సూపర్వైజర్ పద్మజ మాట్లాడుతూ ఆరోగ్యంగా జీవించాలంటే ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం తప్పనిసరి అని పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యానికి సహకారం లభిస్తుందని,గర్భిణులు,బాలింతలు,చిన్నారులకు సమతుల ఆహారం ఎంతో అవసరమని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కొరవడి దీంతో అనేక రుగ్మతలకు గురవుతున్నారని,ఇలాంటి సమస్యలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాలు కలిగిన ఆహారం అందించడమే కాకుండా,ఎలాంటి ఆహారం తీసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించేలా పోషణ పక్వాడ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ నెల 8 వ తేదీ నుంచి 22 వ తేది వరకు 15 రోజుల పాటు అన్నీ ఐ సి డి యస్ ప్రాజెక్ట్ అన్నీ అంగన్వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు,బాలింతలు,చిన్నారులకు ఆరోగ్యకరమైన అంశాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తల్లిపాల ప్రాముఖ్యత,చిరుధాన్యాలు తీసుకోవడంవల్ల కలిగే లాభాలు,పరిసరాల పరిశుభ్రత,చేతుల పరిశుభ్రత,శిశువుల్లో ఇన్ఫెక్షన్ల నివారణ,వ్యాయామం,పండ్లు,కూరగాయల వినియోగం,పౌష్టికాహారం తయారీ విధానం,రక్తహీనత వల్ల కలిగే నష్టాలు,వయస్సుకు తగిన ఎత్తు బరువు లేని పిల్లలను గుర్తించి నివారణ చర్యలను తీసుకోవాలని తెలిపారు.చిన్నారులకు జంక్ ఫుడ్ మరియు ఖుర్ ఖురే పాకెట్ల వల్ల గ్యాస్ ట్రబుల్ వచ్చే అవకాశం ఉందని,మొబైల్ ఫోన్లు పిల్లలకు ఇవ్వకూడదని తద్వారా అనారోగ్య సమస్యలు ఏర్పడుతాయని తల్లులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో అంగన్వాడీ కేంద్రం లో గజ్జల యస్వంత్ చందు అనే అంగన్వాడీ విద్యార్థి పుట్టినరోజు సందర్బంగా వారి తల్లిదండ్రులు గజ్జల రామాంజనేయులు హైమావతి దంపతులు అంగన్వాడీ కేంద్రానికి వాటర్ క్యాన్ అందజేశారు.వాటర్ క్యాన్ అందజేసిన చిన్నారి తల్లిదండ్రులను బోయలపల్లి సెక్టార్ సూపర్ వైజర్ పద్మజ అభినందించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పూజల.మూర్తెమ్మ,ఆయా శిఖరం.నాగేశ్వరి,గర్భవతులు,బాలింతలు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడులో పోషణ పక్వాడలో పాల్గొన్న పిడి సిహెచ్ లక్ష్మి,కెవిఐబి వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు

## చిన్నారుల మెదడు అభివృద్ధికి తల్లిదండ్రులు దోహదపడాలి

## సిడీపీవో పద్మావతి

**ప్రత్తిపాడు, ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గ్రామంలో ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ సిడిపివో పద్మావతి ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మి,ఖాదీ చిన్న తరహా పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,ప్రముఖ న్యాయవాది బుగత శివ హాజరయ్యారు.ఐసిడిఎస్ ప్రత్తిపాడు సెక్టార్ అంగన్వాడి కేంద్రం వద్ద నిర్వహించిన ఈ పోషణ పక్వాడ కార్యక్రమంలో గర్భిణీ బాలింతలు ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లల తల్లులకు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.సూపర్ డేలో చిన్నారి తండ్రులను భాగస్వామ్యం,ప్యాకెట్ మరియు సంప్రదాయ చిరుతిల్లు మధ్య తేడా,ఆట బొమ్మల సేకరణ ద్వారా చిన్నారులను ఉత్తేజంపజేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అనంతరం బాలింతలకు పోషక పదార్థాలను అందించారు.పిల్లల పెంపకాలలో తండ్రులు కూడా బాధ్యత వహించాలని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ప్రక్రియ అంగన్వాడి కేంద్రాల ద్వారానే ప్రారంభమవుతుందని తెలిపారు. చిన్నారులకు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చేసరికి మెదడు 80శాతం అభివృద్ధి చెందుతుందని ఆరు సంవత్సరాల వయసు వచ్చేసరికి మెదడు పూర్తిగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లలను చెడు అలవాట్లు స్క్రీన్,టీవీ మొబైల్ ఫోన్లకు మరియు ఐస్ క్రీం,చక్కెర వంటి పదార్థాలకు వంటి వాటికి దూరంగా ఉంచాలని కోరారు.చిన్నారులు తాత అమ్మమ్మ నాయనమ్మలు చెప్పే మంచి మంచి కథల ద్వారా వాళ్లకు మెదడు అభివృద్ధి ప్రక్రియలో దోహదపడాలని సూచించారు.తమ తమ పిల్లలకు ఇంటి లోపల మరియు బయట ప్రదేశాలలో ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.దీని ద్వారా శారీరక నైపుణ్యాలు మెరుగుపడతాయని సామాజిక భావోద్వేగ వికాసం పెరుగుతుందన్నారు.మంచి పోషకాలు అందించాలని దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మెదడు అభివృద్ధికి సహాయపడుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.చిన్నారుల పెంపకాలలో తండ్రులు కూడా బాధ్యతలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు,ఏపీఎం జి శ్రీనివాసరావు,ప్రత్తిపాడ జగ్గంపేట సిడిపివోలు టిడిఆర్ పద్మావతి,యం పూర్ణిమ,కూటమి నాయకులు మూరా చంటిబాబు, గోపి, సూపర్వైజర్లు వరలక్ష్మి,సూర్యకుమారి,చక్రవేణి, మంగా రత్నం,సునీత,సిడిఎస్ టీచర్లు, హెల్పర్లు, పలువురు గర్భిణీలుబాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.





# పునర్విభజన మహిళా,జమిలిబిల్లు సమాఖ్య వ్యవస్థను దెబ్బతీయటానికే..!!

## సి.పి.ఐ (ఎం.ఎల్ )రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్.డి.హరినాథ్..!!

**నందికొట్కూరు ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** కేంద్రీకృత అధికారం కోసమే మోడీ ఈ జంట బిల్లులు ఆమోదానికి ప్రయత్నిస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా విస్సన్న పేటలో సి.పి.ఐ(ఎం.ఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ విమర్శించారు.మహిళా బిల్లుకు తాము వ్యతిరేకం కాదని దాన్ని అమలు చేయటానికి పూర్తి మద్దతు ఇస్తామని డి.హరినాథ్ తెలిపారు.పునర్విభజన బిల్లు ఆమోదం ద్వారా ఉత్తరాది రాష్ట్రాలు గణనీయంగా సీట్లు పెరిగి లబ్ధిపొందుతాయని,దక్షిణాది,ఈశాన్య రాష్ట్రాలు సీట్లు తగ్గి నష్టపోతాయని డి.హరినాథ్ అన్నారు.ఎన్డీఏ కూటమిలో ఉన్న చంద్రబాబు దీన్ని సమర్థించడం ద్వారా సీట్లు పెరగకపోగా,రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసినట్లేనన్నారు.బిల్లులను వ్యతిరేకించే వారిని మహిళా రిజర్వేషన్ వ్యతిరేకులుగా ముద్ర వేయడం సరికాదని డి.హరినాథ్ అన్నారు.పార్లమెంట్ లో ఇప్పటికే ఆమోదించబడిన మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం కోసం,పశ్చిమ బెంగాల్,తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంలోనేసమావేశాన్ని ఏర్పటు చేయటం ఓటర్ల ను ప్రభావితం చేసేందుకే నని డి.హరినాథ్ విమర్శించారు.మోదీ ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం ఉంటే,పార్లమెంట్ మరియు అసెంబ్లీలలో మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్ మరియు జనాభా లెక్కల నుండి వేరు చేసి,ప్రస్తుత సంఖ్యల ఆధారంగా దానిని వెంటనే అమలు చేయవచ్చునని.దీనిని నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడం,భారతదేశపు సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసే చర్యగా డి.హరినాథ్ పేర్కొన్నారు.పునర్విభజన బిల్లును ఆమోదింపజేయడానికి మహిళల రిజర్వేషన్‌ను ఒక ఆయుధంగా మోడీ అమిత్ షా పావులు కదుపుతున్నారని డి.హరినాథ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.ప్రతిపక్ష ఎం.పీలు దక్షిణాది రాష్ట్రాలకుజరగనున్న అన్యాయాన్ని ప్రశ్నించి,మహిళల రిజర్వేషన్ పేరుతో పునర్విభజన బిల్లును కలపవద్దని డిమాండ్ చేయాలని డి.హరినాథ్ కోరారు.కుల గణనను పూర్తి చేసి,తాజా జనగణన కులాల లెక్కల ఆధారంగా సేకరించిన తర్వాత భారతదేశంలో పునర్విభజనను రూపొందించండని సి.పి.ఐ (ఎం.ఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ కోరుతున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ తెలియజేశారు.



# ప్రజాస్వామ్యబద్ధంగా నారీ శక్తి వందన్ చట్టం తీసుకురావాలి

## పి ఓ డబ్లు జాతీయ కన్వీనర్ ఝాన్సీ డిమాండ్...

**ఆలేరు ఏప్రిల్ 17. (అఖండభూమి న్యూస్):** నిర్ణయాధికార సభలలో సమ భాగస్వామ్యం కోసం మహిళలు ఎప్పటినుండో పోరాడుతున్నారని ప్రగతిశీల మహిళా సంఘం (పివోడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ జి ఝాన్సీ అన్నారు. శుక్రవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో రాష్ట్ర కార్యదర్శి ఆర్ సీతతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్లమెంటు లో వివిధ పాలకవర్గ పార్టీలు అనేక సందర్భాలలో మహిళా బిల్లును అడ్డుకుంటూ వచ్చాయని ఆరోపించారు. పార్లమెంట్లో మహిళా రిజర్వేషన్ బిల్లును తొలిసారిగా ప్రవేశపెట్టినప్పటి నుండి గత 30 సంవత్సరాలకు పైగా సుదీర్ఘమైన పోరాటాన్ని మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం దేశవ్యాప్తంగా నిరసనలు, పార్లమెంటు ముందు ధర్నాలతో పాటు న్యాయస్థానాలను సైతం ఆశ్రయించి, పోరాడిన మహిళా సంఘాలను రాజకీయ పార్టీలు, పౌర సమూహాలను ఏమాత్రం సంప్రదించకుండానే ఆమోదించడం అనేది ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్యగా అభివర్ణించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం మరోసారి నిర్ణయాధికార సంస్థల్లో మహిళా రిజర్వేషన్ అంశాన్ని ముందుకు తెస్తూ, ఎన్నికలలో ప్రయోజనం పొందడం కోసం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. 2025 సెప్టెంబర్ లో బీహార్ శాసనసభ ఎన్నికలకు మోడీ ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, పూర్తి వివరాలను వెల్లడించకుండానే నారి శక్తి 100 బిల్లును ఆమోదించిందని తెలిపారు. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును తీసుకోవడానికి మరోసారి పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం మనీ ప్రశ్నించారు. నూతన బిల్లు జనాభా లెక్కలు, డీ లిమిటేషన్కు సంబంధించిన పాత నిబంధనలలో సవరణలో ప్రతిపాదిస్తుందని అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల మధ్యలో ఇంతటి ముఖ్యమైన బిల్లును తీసుకురావడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందడానికి ప్రభుత్వం చూస్తుందని అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల మధ్య ప్రాముఖ్యత కలిగిన చట్టాన్ని పార్లమెంటు ప్రత్యేక సమావేశాలలో చర్చించడం ప్రజాస్వామ్య ప్రక్రియకు విరుద్ధమని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్ లు ఆలస్యం చేసి, షరతులను విధిస్తూ, మహిళా రాజకీయ ప్రాతినిధ్యాన్ని నీరుగార్చడానికి చేస్తున్న కుట్రల్లో భాగమేనని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల బిల్లు అమలుకు ముందు సీట్లను పెంచడానికి పెట్టిన షరతులను అంగీకరించడం లేదని అన్నారు. ఇప్పటికీ సీట్లను ఎలా విభజిస్తారు అనేదానికి కేంద్ర ప్రభుత్వం దగ్గర స్పష్టత లేదని చెప్పారు. ఇలాంటి చర్య మహిళా ప్రాతినిధ్యాన్ని కల్పించడం అనేది కాకుండా, అమలుకు వాయిదా వేసే ఎత్తుగడగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలలో భాగమేనని ఆరోపించారు. ఇది అధికార పార్టీ ప్రతిస్వామ్య భావాజారానికి నిదర్శనమని అన్నారు. మహిళా రిజర్వేషన్ కు జనాభా లెక్కలతో ముడి పెట్టడం ద్వారా జాప్యానికి ఆస్కారం ఏర్పడుతుందని అన్నారు. పథకం ప్రకారం ఆలస్యం చేసే చర్యలను వ్యతిరేకిస్తున్నామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. 2023 బిల్లులోని జనాభా లెక్కలు, డీలిమిటేషన్ షరతులను తొలగించి, గతంలో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓబిసి మహిళా రిజర్వేషన్ అంశాన్ని పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మహిళా రిజర్వేషన్ జనాభా లెక్కలతోనూ, డీలిమిటేషన్ తోనూ ముడిపెట్టడం సరికాదని చెప్పారు. మహిళా రిజర్వేషన్ అనేది ఒక ప్రత్యేకమైన అంశంగా పరిగణిస్తూ ఇతర అంశాల నుండి వేరుగా చూడాలని సూచించారు.



మహిళా సంఘాలతో, రాజకీయ పార్టీలతో, పౌర సమూహాలతో సంబంధించిన వర్గాలన్నిటితో కూడా సరైన సంప్రదింపులు జరిపి, ప్రజాస్వామ్యబద్ధంగా చర్చ జరగకుండా తొందరపాటుగా ఎన్నికలలో ప్రయోజనం పొందే ఉద్దేశంతో ఆమోదించే ప్రయత్నాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారతకు చిత్తశుద్ధితో, పారదర్శక కార్యాచరణ చేపట్టాలని ఈ సందర్భంగా వారు కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును నీరు కార్చే ప్రయత్నం చేస్తే మహిళ ఆగ్రహానికి బిజెపి ప్రభుత్వం గులిక తప్పదని హెచ్చరించారు.....

# అగ్ని ప్రమాదాల నివారణపై పలు పాఠశాలలో అవగాహన కార్యక్రమం

**యర్రగొండపాలెం ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** యర్రగొండపాలెం పట్టణంలోని నలంద హై స్కూల్,యాపిల్ హై స్కూల్ మరియు కస్తూర్బా హై స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక శాఖ అధికారి డి. మాల్యాద్రి ముఖ్య అతిథిగా హాజరై అగ్ని ప్రమాదాల కారణాలు, అవి ఎలా జరుగుతాయి, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు,విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా డి. మాల్యాద్రి మాట్లాడుతూ ఉపాధ్యాయులు,విద్యార్థులు అగ్నిప్రమాద పరిస్థితుల్లో ఎలా స్పందించాలి అనే అంశాలపై డెమో ప్రదర్శనలు నిర్వహించి ప్రత్యక్షంగాచూపారు.అనంతరం ప్రజల్లో అగ్ని అవగాహన పెంపొందించేందుకు కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదం జరిగితే తరువాత 101,108 ఫోన్ చేసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది చేరుకొని ప్రమాదాన్ని నివారించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.కార్యక్రమంలో ఎల్ ఎఫ్ లు టి వెంకటేశ్వర్లు, ఎంవి కోటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎరిక్సన్ బాబు




**ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** యర్రగొండపాలెం,ఆర్ సి ఇంచార్జ్ యర్రగొండపాలెం నియోజకవర్గం లోని దోర్నాల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇంచార్జి గూడూరి ఎరిక్సన్ బాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దోర్నాల మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించగా వాటిని స్వయంగా పరిశీలించిన ఎరిక్షన్ బాబు తక్షణమే సంబంధిత అధికారులకు చరవాణి ద్వారా సంప్రదించి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.మిగిలిన వినతులపై కూడా వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను సూచించారు.ప్రతి వినతి పత్రాన్ని ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు,మండల టీడీపీ అధ్యక్షులు షేక్ మాబు, కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భీమా సొమ్ము రూ. 2 లక్షలు అందజేత



**జి.మాడుగుల, ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** మండలంలోని కోరాపల్లి పంచాయతీ అరగడపల్లి గ్రామానికి చెందిన అరగడ చిన్నికృష్ణమ నాయుడు మరణించగా, ఆయన గతంలో చేయించుకున్న 'ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా' (పీఎంజేజేబీవై) పథకం ద్వారా రూ. 2 లక్షల క్లెయిమ్ మంజూరైంది.స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, బ్యాంక్ మిత్ర వండలం జాన్ పాల్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ పూర్తి చేయగా, ఆ సొమ్ము నామినీ అరగడ రూపవతి బ్యాంకు ఖాతాలో జమయినట్లు వారు తెలిపారు . ఆపద సమయంలో ఈ ఆర్థిక సాయం అందడం పట్ల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఒప్పిచర్ల శివాలయంలో శివ కళ్యాణ వేడుకలు

## శివాలయం నిర్మాణానికి 43 లక్షల విరాళం.కందుల శ్రీనివాసరావు

**మాచవరం ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామంలో ఇటీవల ప్రతిష్ట కార్యక్రమం జరిగిన శివాలయం ఈరోజు 16 రోజుల పండుగ సందర్భంగా శుక్రవారం శివాలయం ఆవరణలో జరుగుతున్న శివ కళ్యాణం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు దంపతు సమేతంగా హాజరైన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.శివాలయం నిర్మాణాభివృద్ధికి దాదాపు 43 లక్షల రూపాయల విరాళాన్ని మాచవరం మండలం కొత్త గణేశుని పాడు గ్రామానికి చెందిన స్వర్గీయ కందుల పుల్లయ్య మాస్టారు కుమారుడు కందుల శ్రీనివాసరావు దంపతులు అందజేశారు. కందుల శ్రీనివాసరావుకుటుంబ సమేతంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు



# తెలంగాణ రైతు సంఘం మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి పిలుపు....



భువనగిరి ఏప్రిల్ 17. (అఖండభూమి న్యూస్): **తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను ఏప్రిల్** 23 నుండి 25 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం లో నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ అన్నారు. శుక్రవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి మండలంలోని నమాజ్ పల్లి గ్రామంలో ఆయన నాయకులతో కలిసి రాష్ట్ర మహాసభల సందర్భంగా ముద్రించిన గోడప్రతులను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశం అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవర్ణ బిల్లు, బహుళ జాతి కంపెనీల విత్తనాల దిగుమతి చేసుకునే విత్తన సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని సూచించారు. మోడీ ప్రభుత్వం భారత దేశ సర్వ బౌమత్వాన్ని, స్వావలంబనను అమెరికా దేశానికి అప్పగించరాదని అన్నారు. చారిత్రాత్మక రైతాంగ పోరాట నేపథ్యంలో డిసెంబర్ 9 2021 నాటి లేఖలో కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన అన్ని అంశాలపై పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అన్ని పంటలకు సీ2o25% (కనీస మద్దతు ధర) చట్టాన్ని అమలు చేయకుండా దేశ రైతాంగాన్ని మోసం చేయడానికి మోడీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా లిఖితపూర్వకంగా ఇచ్చిన ఒప్పందాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తుందని అన్నారు. జీఎస్టీ వసులలో 60 శాతం రాష్ట్రాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతాంగం పై పెను భారం మోపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై మూడవ రాష్ట్ర మహాసభలలో సమగ్రంగా చర్చించి, భవిష్యత్తు పోరాట రూపకల్పన చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో అనేక రైతాంగ హక్కులపై ఉద్యమాలను నిర్వహించి, భూ నిర్వాహశతులకు, పోడు భూముల రైతుల పట్టాల హక్కులకై ఎన్నో పోరాటాలు నిర్వహించేయమని విజయం సాధించామని గుర్తు చేశారు. మూడో మహాసభల సందర్భంగా ఏప్రిల్ 20,21 తేదీలలో అన్ని గ్రామ, మండల కేంద్రాలలో ద్విచక్ర వాహన ర్యాలీలు, మహాసభల ప్రారంభ సూదికగా రైతు సంఘం జండాలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం పట్టణంలో జరిగే మూడు రోజుల మహాసభలకు అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు అశోక్ దావలె, ప్రధాన కార్యదర్శి విద్యు కృష్ణన్ తో పాటు జాతీయ, రాష్ట్ర రైతు ఉద్యమ నాయకులు పాల్గొనే ఈ మహాసభలను జయప్రదం చేసేందుకు అన్ని వర్గాల ప్రజల సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జిట్టా అంజిరెడ్డి, మాజీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ సత్తిరెడ్డి, నాయకులు ఏట్టారెడ్డి, రవీందర్ రెడ్డి, నారాయణరెడ్డి, రమేష్ రెడ్డి, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు....

# రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

## డీఎస్ఓ డి అంకయ్య



**యర్రగొండపాలెం ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** రేషన్ డీలర్లు రేషన్ పంపిణీ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎస్ఓ డి అంకయ్య అన్నారు. శుక్రవారం యర్రగొండపాలెం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు రేషన్ పంపిణీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలవకుండా రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలని వారి పట్ల బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.ఈకేవైసీ పూర్తి చేయాలని చెప్పారు. వేసవికాలం దృశ్య రేషన్ షాపులు వద్ద కార్డుదారులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని చెప్పారు. అనంతరం హెచ్.పీ గ్యాస్ గూడెంని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యాస్ ఏజెన్సీ వారితో మాట్లాడారు. ప్రజలకు గ్యాస్ పంపిణీ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం రేషన్ డీలర్లు డీఎస్ఓ డి అంకయ్య ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాధరెడ్డి, ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్. చంద్రశేఖర్,డీలర్ల సంఘం అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి (మ్యాక్స్), కృష్ణ, కిషోర్, వలి, బ్రహ్మ రెడ్డి, గంగయ్య, అయ్యుబ్ తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు బడిని కాపాడుదాం వర్షపు చుక్కలు ఒడిసిపట్టుదాం

మండల విద్యాశాఖ అధికారి పి ఆంజనేయులు



**యర్రగొండపాలెం ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోయలపల్లిలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా వర్షపు నీటిని ఒడిసి పట్టుకోండి అనే నినాదంతో జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని ఎంఈఓ ఆంజనేయులు ప్రారంభించారు.పాఠశాల ఆవరణలో మొక్కలకు నీరు పోసి, నీటి విలువను విద్యార్థులకు వివరించారు. భవిష్యత్ తరాల కోసం నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అనంతరం విద్యార్థులతో జల సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.అలాగే ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఆరో తరగతిలో కొత్త విద్యార్థులకు ఎంఈఓ ఆంజనేయులు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు హేమలా నాయక్ పూల స్వాగతం పలికారు. సర్వాయి పాలెం, చిన్న బోయలపల్లి, బోయలపల్లి ఎస్సీ పాటశాలల 22 మంది విద్యార్థులను ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.తదుపరి మన ఊరు బడిని కాపాడుదాం అనే నినాదాలతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, హేమలా నాయక్, సతీష్, విజయ కుమార్ ఉపాధ్యాయులు, గాలయ్య, యేసా నాయక్, శ్రీనివాస్,సిఆర్ఎంటి లు శ్రీనివాస్, దుర్గా రావు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ముంగర్లపాలెంలో భూ రీసర్వేకు శ్రీకారం

రైతులకు అవగాహన కల్పించిన తహసీల్దార్ నూకరాజు -- అవగాహన ర్యాలీ నిర్వహణ






**గొలుగొండ ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** గొలుగొండ మండలం ఏటిగైరంపేట పంచాయతీ పరిధిలోని ముంగర్లపాలెం గ్రామంలో భూ రీసర్వే ప్రక్రియను ప్రారంభించేందుకు శుక్రవారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. మండల తహసీల్దార్ కాకర నూకరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భూ రీసర్వేకు సంబంధించిన విధివిధానాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. రీసర్వే ద్వారా భూసరిహద్దుల స్పష్టత, భూ వివాదాల నివారణ, రికార్డుల సరిదిద్దడం వంటి ప్రయోజనాలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆర్ఎస్‌డీటీ కొండబాబు, వీఆర్వో రాజుబాబు, గ్రామ సర్వేయర్ శ్యాంబాబు పాల్గొని రీసర్వే ప్రాధాన్యతను వివరించారు. స్థానిక రైతులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం గ్రామంలో రీసర్వేపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు అధికారులు, గ్రామస్తులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు.

## భక్తులతో కళకళలాడిన పోతులూరు మోదకొండమ్మ జాతర

అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలి

మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు





**ప్రత్తిపాడు,(అఖండభూమి న్యూస్ ఏప్రిల్ 17 ):** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని పోతులూరు గ్రామంలో మోదకొండమ్మ అమ్మవారి జాతర శుక్రవారం వైభవంగా నిర్వహించారు.గ్రామ దేవతగా ఆరాధించే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి,నైవేద్యాలు సమర్పిస్తూ భక్తులుమొక్కుబడులు తీర్చుకున్నారు.ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.జాతర సందర్భంగా డప్పుల నాదం,కోలాటాలు,శక్తి వేషాలు,అఘోరాల ప్రదర్శనలు,బుర్రకథలు గ్రామస్తులను అలరించాయి.సంప్రదాయ కళారూపాలు జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు పంచాది నారాయణమూర్తి,రాజా,మాజీ సర్పంచ్ పంచాది వీరబాబు కుటుంబ సభ్యులు అమ్మవారికి చీరలు సమర్పించి ఉయ్యాల సేవ నిర్వహించారు.గ్రామస్తుల సహకారంతో జాతర ఉత్సవాలు కోలాహలంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శెట్టి గంగబాబు,రుద్రారపు సత్తిబాబు,శెట్టి రాంబాబు,వి.రాంబాబు,బొంతు నాగేశ్వరావు,శెట్టి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై అవగాహన సదస్సులో సిఐ ఎం నాగ దుర్గారావు






**కాకినాడ,(అఖండభూమి న్యూస్ ఏప్రిల్ 17):** కాకినాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో శుక్రవారం మహిళా భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి సిఐ ఎం నాగ దుర్గారావు హాజరై మహిళలకు భద్రతకు సంబంధించిన పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని,రాత్రి సమయాల్లో ఒంటరిగా ప్రయాణించేప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.మహిళలపై జరిగే వేధింపులు,నేరాలపై ఎటువంటి భయం లేకుండా ఫిర్యాదు చేయాలని,పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, యువతులు పాల్గొని అవగాహన పొందారు.

# దళితుల భూ సమస్యల పరిష్కారానికి ఎస్సీ కమిషన్ సభ్యుడు రామారావు సీతారామ్ కు కెవిపిఎస్ వినతి

-పట్టాల మంజూరు, 22-ఏ జాబితా తొలగింపు డిమాండ్



**ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** గొలుగొండ మండలంలో దళితులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి ఆధ్వర్యంలో ప్రతినిధులు ఎస్సీ కమిషన్ సభ్యుడు రావాడ సీతారాముకు వినతిపత్రం సమర్పించారు. చీడికాడ, నాగాపురం, కేడీపేట గ్రామాల్లో 1993-94లో ల్యాండ్ సీలింగ్ కింద కేటాయించిన భూములకు పట్టాలు మంజూరు చేయాలని, 22-ఏ జాబితాలో ఉన్న భూములను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

**సబ్-ప్లాన్ నిధులతో అభివృద్ధి, సంక్షేమం కోసం వినతి**

దళితవాడల్లో ఎస్సీ, ఎస్టీ సబ్-ప్లాన్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని, అర్హులైన డప్పు కళాకారులు, చర్మకారులకు పెన్షన్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. అంతర్వర్ణ వివాహితులకు ఆర్థిక సహాయం అందించాలని కూడా పేర్కొన్నారు. కార్యక్రమంలో కొండ్రపు మరిడియ్య, కన్నబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విప్లవ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

శాంతి ఖని గనిపై నల్ల బ్యాడ్జిలతో నిరసనలు








**బెల్లంపల్లి ఏప్రిల్ 17(అఖండ భూమి న్యూస్):** నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లకు నిరసనగా శుక్రవారం శాంతిఖని గనీ మీద కార్మికులకు నల్ల బ్యాడ్జీలు పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను ఉపసంహరించుకోవాలని(రిజిస్టర్డ్) విప్లవ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలపడం జరిగింది.అలాగే

**నాలుగు లేబర్ కోడులు;** కార్మిక చట్టాలను సులభంగా అమలు చేయడానికి అని చెప్పి గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను కలిపి(2019--2020) మధ్య నాలుగు లేబర్ కోడ్ లుగా రూపొందించారు.2020 సెప్టెంబర్ లో వీటిని చట్టంగా ఆమోదించారు.వీటిలో నిజంగా కొత్త ధనం పెద్దగా లేదు.ఈ కాలానికి అవసరమైన కొత్త నిబంధనలు, సీలింగులు కలిపారు తప్ప నాటి కార్మిక చట్ట వ్యతిరేక స్వభావంలో మార్పు లేదు. పాత చట్టాలలో కార్మికులకు అనుగుణ్యంగా ఉండిన కొద్దిపాటి నిబంధనలు కూడా ఏనాడు అమలు నోచుకోలేదు.ఇక ఇప్పుడు తెచ్చిన కోడ్ ల పరిస్థితి ఈ విషయంలో దీనికి భిన్నంగా ఉంటుందన్న గ్యారంటీ ఏమీ లేదు.కొత్తకొడ్ తీసుకువచ్చిన మార్పుల వల్ల ఉద్యోగ భద్రత తగ్గి యజమానానికి ఎక్కువ అధికారం వస్తున్నది.కొత్త నియమాల ప్రకారం కార్మికుల నిరసన హక్కు కూడా పరిమితం అవుతున్నది. 300 మంది ఉద్యోగులు ఉన్న సంస్థ లలో కూడా ఉద్యోగులను సులభంగా తొలగించే అవకాశం యాజమానులకు కల్పించారు.గతంలో ఇది వందమంది ఉన్న సంస్థలకే పరిమితమై ఉండేది. కాంట్రాక్ట్,గిగ్ వర్కర్లకు పూర్తి రక్షణ ఇప్పటికీ కలిగించలేదు.సామాజిక భద్రతపై ప్రభుత్వ బాధ్యత మరింత తగ్గిపోతున్నది.ఈ నియమవళిని రూపొందించడం ద్వారా భారతీయ కార్మికుల ప్రాథమిక సమస్యల పరిష్కారానికి మార్గ నిర్దేశం చేసే అవకాశం ప్రభుత్వానికి లభించింది.కానీ ప్రభుత్వం ఆ అవకాశాన్ని కార్మిక వ్యతిరేక అంశాలను కలపడానికి వినియోగించింది.ఈ కోడ్ లలో గతంలోని లోపాలను కొనసాగిస్తున్నారు. ఉద్యోగ భద్రతను నిర్ధారించడం, బీరసారాలలో ట్రేడ్ యూనియన్ల భాగస్వామ్యాన్ని అనుమతించడం, కనీస వేతనాలను నిర్ణయించడం,ఆహార కేలరీలను నిర్ణయించడంలో లింగ వివక్షను పరిష్కరించడం,సార్వత్రిక సామాజిక భద్రత,ఆర్థిక భద్రత,ఆరోగ్య పరిరక్షణ అన్న విషయాలలో ఏ నూతన ప్రస్తావన లేదు.ఆర్థిక విషయంలో కొత్త కోడ్ లు సామాజిక భద్రత పథకాలు కావు, ప్రభుత్వ దోపిడీ స్కీములు అని కార్మికులు భావిస్తున్నారు.ఈ కార్మిక వ్యతిరేక చట్టాలు అన్ని తొలగించాలని కార్మిక వర్గం పెద్ద ఎత్తున 2026 ఫిబ్రవరి 13న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కూడా నిర్వహించారు.కానీ ప్రభుత్వం ఒక్క నిబంధన కూడా కార్మికులకు అనుకూలంగా మార్చడానికి సిద్ధం కావడం లేదు.వీటిని వ్యతిరేకించాల్సిన జాతీయ కార్మిక సంఘాలు పట్టించుకోకుండా కార్మిక వర్గానికి ద్రోహం చేస్తున్నాయి.కాబట్టి వీరిపాట్ల కార్మిక వర్గం అప్రమత్తంగా ఉండాలని,వారిని కార్మిక వర్గం నిలదీయాలని,కార్మిక వర్గానికి విప్లవ కార్మిక సంఘాలు పిలుపునిస్తున్నాయి.ఈ కార్యక్రమంలో ఎం. పోచ మల్లు (ఏఐఎఫ్టీయూ)రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్ (ఎస్జీకేఎస్)సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు,గోగర్ల శంకర్ (టీయూసీఐ) రాష్ట్ర నాయకులు, జీ.అంజయ్య ప్రధాన కార్యదర్శి (ఏఐఎఫ్టీయూ)ఎన్నం శంకర్ సింగరేణి గని సంఘం బెల్లంపల్లి రీజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో జె.హెచ్.ఎస్ (జీ.H.S) అకాడమీ విద్యార్థుల ప్రభంజనం






**( రేపల్లె నియోజకవర్గ ఇన్చార్జి: సిహెచ్ రాంబాబు. చెరుకుపల్లి. ఏప్రిల్ 17. అఖండ భూమి న్యూస్ ):** మండల పరిధిలోని గుళ్ళపల్లి గ్రామానికి చెందిన జె.హెచ్.ఎస్ అకాడమీ విద్యార్థులు ప్రాచీన క్రీడలైన కర్రసాము, కత్తిసాములకు పూర్వ వైభవం తీసుకువస్తూ, ఆధునిక క్రీడల్లోనూ విజయకేతనం ఎగురవేస్తున్నారు. అకాడమీ వ్యవస్థాపకులు సొంటి నాంచారయ్య (వ్యాయామ విద్యలో మాస్టర్స్, ఎన్.ఐ.ఎస్ కోచ్) పర్యవేక్షణలో 2021లో ప్రారంభమైన ఈ సంస్థ, ఐదేళ్లలోనే జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిల్లో ఎన్నో పతకాలను, బహుమతులను కైవసం చేసుకుంది. ఇక్కడ విద్యార్థులకు కేవలం శిక్షణ మాత్రమే కాకుండా, వారి శారీరక సామర్థ్యాన్ని పరీక్షించే 'బ్యాటరీ టెస్ట్' నిర్వహించి, వారి శక్తికి తగిన క్రీడను ఎంపిక చేస్తారు. ముఖ్యంగా క్రీడలకు అవసరమైన వేగం, బలం, ఓర్పు, సమన్వయం మరియు శరీరం వంగే గుణం (ఫ్లెక్సిబిలిటీ) పై నిపుణులైన శిక్షకులు ప్రత్యేక దృష్టి సారించి శిక్షణ ఇస్తున్నారు. అథ్లెటిక్స్, క్రికెట్, కత్తిసాము (ఫెన్సింగ్), టైక్వాండో, స్కేటింగ్, యోగా, జిమ్నాస్టిక్స్, రగ్బీ, సెపక్ తక్రా, ఫుట్‌బాల్, ఆటియా-పాటియా, చెస్, కబడ్డీ, ఖోఖో మరియు షటిల్ బ్యాడ్మింటన్ వంటి అనేక రకాల క్రీడల్లో ఇక్కడ శిక్షణ అందుబాటులో ఉంది. ఈ అకాడమీ నుండి ఎంతో మంది ప్రతిభావంతులు వెలుగులోకి వచ్చారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన చాణక్య, కర్రసాము మరియు క్రికెట్లలో రాణిస్తున్న జ్యోతిర్మయి, కత్తిసాము విభాగంలో 5 సార్లు పతకాలు సాధించిన భవ్యశ్రీ, క్రికెట్ మరియు కర్రసాము విజేత రిహాన్, రాష్ట్ర స్థాయి టైక్వాండో పోటీల్లో పాల్గొన్న ఆశ్రిత వంటి విద్యార్థులు తమ ప్రతిభతో అకాడమీకి పేరు తీసుకువస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు సానపెట్టి, వారిని అత్యున్నత స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని అకాడమీ నిర్వాహకులు ఈ సందర్భంగా తెలియజేశారు.

# 2026 ఏప్రిల్ 17 న జాతీయ నిరసన దినంగా పాటించండి...!! ఏ.ఐ.సి.సీ.టి.యు



**నందికొట్కూరు ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** నోయిడా, మానేసర్,ఫరీదాబాద్ మరియు ఇతర ప్రాంతాల్లో ఇటీవల జరిగిన నిరసనలు మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలు,అలాగే డిల్లీ-ఎన్.సి.ఆర్ ప్రాంతంలో ఫాక్టరీ యజమానుల అవధులు లేని లాభాపేక్ష వల్ల చెలరేగాయి.సుధీర్ఘ కాలంగా ముందుకు వస్తున్న కార్మికుల డిమాండ్లను జాప్యం చేస్తూ నిర్లక్ష్యానికి గురి చేయడమే కాకుండా,ఫాక్టరీ యజమానులు -రాజ్య యంత్రాంగపు అపవిత్ర కూటమి బంధం నిరసన తెలిపిన కార్మికులపై పదే పదే ప్రతీకార చర్యలు -శిక్షలకు దారి తీసింది.ఎల్.పి.జి మరియు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో వలస కార్మికులను అయితే ప్రశ్నించడం లేకపోతే ఆకలి చావులకు సిద్దపడాల్సిన గత్యంతరం లేని పరిస్థితులకు నెట్టాయి...!! ఏప్రిల్ 17వ తారీఖున నిరసన దినం పాటిస్తూ డిల్లీ - ఎన్సిఆర్ కార్మికుల పోరాటానికి మద్దతు తెలుపుతూ దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఏ.ఐ.సీ.సీ.టు జాతీయ కమిటీ పిలుపునిస్తుంది...!!

నిరసన తెలుపుతున్న కార్మికులు యూనియన్ కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలి...!!

కార్మికుల న్యాయమైన పోరాటంపై పోలీసుల దమనకాండ నిలిపివేయాలి...!!

పస్తులు పెట్టే స్థాయి వేతనాలను వ్యతిరేకించండి. నెలకు 42000/-కు తక్షణమే వేతనాలు పెంచాలి....!!

12 గంటల పని దినాలు రద్దు చేయాలి. ఓవర్ టైం(అదనపు పని గంటలకు) చేసిన సమయానికి డబుల్ వేతనం గ్యారంటీ చేయాలి...!!

కార్మికులందరికీ పని ప్రదేశంలో భద్రత ఽసామాజిక భద్రత సదుపాయాలను తప్పనిసరి చేయాలి...!!

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి...!!

కార్మికుల శ్రమను దోపిడీకి గురి చేసే కాంట్రాక్టు విధానాన్ని,నిర్ణీత కాలపు ఉద్యోగ విధానాన్ని రద్దు చేయాలి...!!

ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసే లాభాల వెంపర్లాటను అరికట్టాలి...!! ఏ.ఐ.సి.సి.టి యు డిమాండ్ చేసింది.

## జనాభా గణన 2027 పై ఏన్యుమినేటర్లు,సూపర్వైజర్లకు శిక్షణ. తాహసిల్దార్ .నాగమల్లేశ్వరరావు





**మాచవరం ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** జనాభా గణన 2027 పై యానిమేనేటర్లకు ,సూపర్వైజర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని మాచవరం మండలం తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు సూచించారు. శుక్రవారం మాచవరంలోని జీకే పబ్లిక్ హై స్కూల్ ఆవరణలో యానిమినేటర్లకు సూపర్వైజర్లకు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ జనాభా గణన పై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించాలని అలాగే ప్రభుత్వం ఇచ్చిన యాప్ ద్వారా నమోదు చేసుకున్న వారి యొక్క డేటాను పరిశీలించాలన్నారు ఈ శిక్షణ తరగతులు మూడు రోజులు పాటు నిర్వహిస్తారు అన్నారు ఈ ఈనెల 16వ తేదీ నుండి 30వ తేదీ వరకు నేరుగా స్వీయ గణన ద్వారా నేరుగా మీ మొబైల్ లోనే వివరాలను నమోదు చేసుకోవచ్చు అన్నారు మే ఒకటో తేదీ నుండి 30వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో గృహాలను సందర్శించి నమోదు చేసిన వివరాలను ధ్రువీకరిస్తారు అన్నారు ప్రజలు ప్రభుత్వం అందజేసిన స్వీయ గణన నమోదును వినియోగించుకోవాలని తహసిల్దార్ నాగమల్లేశ్వరరావు సూచించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కీర్తి సుధా స్రవంతి ఫీల్డ్ ట్రైనర్స్ కోటేశ్వరరావు రామరాజు యాన్యుమినేటర్లు సూపర్వైజర్లు పాల్గొన్నారు


# ప్రాణదాతగా నిలిచే సి.పి.ఆర్...!

రోడ్డు ప్రమాద సమయాల్లో అప్రమత్తతే ముఖ్యం




**నల్లగొండ జిల్లా ప్రతినిధి కురుపాటి గణేష్ చండూరు మండలం ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షణాల్లో స్పందించి, బాధితులకు ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ఎందరో ప్రాణాలను కాపాడవచ్చని చండూరు ఎస్ఐ శివ కుమార్ మరియు పి.హెచ్.సి డాక్టర్ రాజు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గ పరిధిలోని చండూరు మండల కేంద్రంలో శుక్రవారం "రోడ్ సేఫ్టీ - సి.పి.ఆర్ ప్రాధాన్యత" అనే అంశంపై స్థానిక పోలీసు శాఖ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు..108 సిబ్బంది సహాయంతో రోడ్డుపై గాయపడిన వ్యక్తికి ఛాతీపై ఏ విధంగా ఒత్తిడి తీసుకురావాలి, కృత్రిమ శ్వాస ఎలా అందించాలి అనే అంశాలను ప్రజలకు, వాహనదారులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు,గోల్డెన్ అవర్ : ప్రమాదం జరిగిన మొదటి 30 నుండి 60 నిమిషాలు అత్యంత కీలకమైనవని (గోల్డెన్ అవర్), ఆ సమయంలో భయం విడిచి ధైర్యంగా ముందుకు వచ్చి ప్రథమ చికిత్స అందించాలని ఎస్ఐ శివ కుమార్ కోరారు,ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు పాటించడం ఎంత ముఖ్యమో, ప్రమాదం జరిగినప్పుడు సాటి మనిషిని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. ప్రథమ చికిత్సపై అవగాహన ప్రతి పౌరుడికి ఉండాలని ఆయన ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో చండూరు ఎస్ఐ శివ కుమార్, పి.హెచ్.సి డాక్టర్ రాజు, 108 అత్యవసర సేవల సిబ్బంది, స్థానిక పోలీసు సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, వాహనదారులు పాల్గొన్నారు...

## వైకల్యాన్ని జయించి.. ఎవరెస్ట్ శిఖరాగ్రం వైపు: జోగంపేట విద్యార్థి అద్భుత ప్రయాణం!



**గొలుగొండ ఏప్రిల్ 17 (అఖండ భూమి న్యూస్):** సంకల్పం ఉంటే ఆకాశమే హద్దు అని నిరూపిస్తున్నాడు అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం, జోగంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన దివ్యాంగ విద్యార్థి లెక్కల హరి శ్రీ దుర్గా ప్రసాద్. శారీరక వైకల్యాన్ని లెక్కచేయక, పట్టుదలతో హిమాలయాలను అధిరోహించేందుకు సిద్ధమై అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు.



**మంత్రి నారా లోకేష్ ప్రశంసలు**

ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దుర్గా ప్రసాద్‌తో ప్రత్యేకంగా మాట్లాడి అభినందనలు తెలియజేశారు. "జీవితంలో ప్రతి ఒక్కరికీ సవాళ్లు ఎదురవుతాయి, వాటిని అధిగమించడానికి భగవంతుడు ఇచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలి" అని మంత్రి ఈ సందర్భంగా హితవు పలికారు.

**ఎంపిక మరియు శిక్షణ ప్రయాణం**

దుర్గా ప్రసాద్ ఈ అరుదైన అవకాశం దక్కించుకోవడం వెనుక కఠినమైన శ్రమ మరియు నిరంతర సాధన ఉన్నాయి. గతేడాది డిసెంబర్ 6న ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన జోనల్ స్థాయి అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో తన ప్రతిభను చాటి తొలి అడుగు వేశాడు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరపున కడప జిల్లాలోని గండికోటలో నిర్వహించిన నెల రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొని పర్వతారోహణలో మెలకువలు నేర్చుకున్నాడు. అక్కడ చూపిన ధైర్యసాహసాల వల్ల జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికై, హిమాలయాల్లోని లడఖ్ ప్రాంతంలో అత్యంత కఠినమైన 'హై ఆల్టిట్యూడ్ ట్రైనింగ్'ను విజయవంతంగా పూర్తి చేసుకున్నాడు. వైకల్యం అడ్డురాదని నిరూపిస్తూ, ప్రస్తుతం నేపాల్ మీదుగా 16 రోజుల పాటు సాగే సుదీర్ఘ ఎవరెస్ట్ అధిరోహణ యాత్రకు సన్నద్ధమయ్యాడు.

**గురువుల అండ - పాఠశాల గర్వకారణం 67**

ప్రత్యేక ఉపాధ్యాయులు తమ్మిల మాణిక్యం నేతృత్వంలో దుర్గా ప్రసాద్ ఈ అడ్వెంచర్ స్పోర్ట్స్ లో శిక్షణ పొందారు. మాణిక్యం మాస్టర్ అందిస్తున్న ప్రత్యేక సేవలను హెచ్.ఎం నాగభూషణం మరియు ఉన్నతాధికారులు కొనియాడారు.

పాఠశాల ఉపాధ్యాయలు సుబ్బారావు, బి.లోవరాజు, ఈశ్వర్, క్రాంతి కుమార్ తదితరులు, మండల విద్యాశాఖ అధికారులు ఓ. సత్యనారాయణ, జి. కృష్ణ ప్రసాద్, మరియు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు విద్యార్థిని అభినందించారు. రాష్ట్ర స్థాయిలో విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారీ, ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు కూడా హరి శ్రీ దుర్గా ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

**భావి ఆకాంక్ష**

తన తల్లిదండ్రుల సహకారం, గురువుల ప్రోత్సాహంతో ఎవరెస్ట్ పై అడుగుపెట్టి, తన పాఠశాలకు మరియు రాష్ట్రానికి పేరు తీసుకురావడమే లక్ష్యమని దుర్గా ప్రసాద్ ధీమా వ్యక్తం చేశాడు. వైకల్యం అనేది శరీరానికే తప్ప మనసుకి కాదని నిరూపిస్తున్న ఈ చిన్నారి సాహసయాత్ర దిగ్విజయంగా పూర్తి కావాలని ఆశిద్దాం.

